సీఎండీఏ ఆధ్వర్యంలో
కేసీబీటీ మొబైల్ యాప్

● ఆవిష్కరించిన మంత్రి శేఖర్‌బాబు



మొబైల్ యాప్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శేఖర్‌బాబు, చిత్రంలో సీఎండీఏ అధికారులు

అడయార్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఎండీఏ) ఆధ్వర్యంలో రూపొందించిన కేసీబీటీ మొబైల్ యాప్‌ను మంత్రి శేఖర్ బాబు మంగళవారం ఆవిష్కరించారు. కిలాంబాక్కంలో కలైంజర్ సెంటినరీ బస్ టెర్మినల్‌ను సీఎండీఏ నిర్మించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ బస్ టెర్మినల్‌లో ప్రయాణికులు తమ అనుభవాలు, సూచనలు, సలహాలు ఇచ్చేందుకు ఈ మొబైల్ యాప్‌ను తయారు చేశారు. దీన్ని మంత్రి శేఖర్ బాబు సీఎండీఏ ప్రధాన కార్యాలయంలోని ఆడిటోరియంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ ఆర్.ప్రియ, హౌసింగ్ బోర్డు కార్యదర్శి కాకర్ల ఉష, సీఎండీఏ సభ్య కార్యదర్శి అన్షుల్ మిశ్రా తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ మొబైల్ యాప్ వల్ల ప్రయాణికులు సులభతరమైన సేవలు పొందవచ్చు. ముఖ్యంగా ప్రయాణికులు తామున్న ప్రదేశం నుంచి కేఎంబీటీని రూట్‌మ్యాప్ మ్యాప్‌ద్వారా తెలుసుకోవచ్చు. ఎస్ఈటీసీ, టీఎన్ఎస్‌టీసీ బస్సులు స్టాపింగ్, ప్రయాణ సమయాలు, కేఎంబీటీలో బస్సులు ఆగే ఫ్లాట్‌ఫాం నెంబర్లు, తదితర వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు. చెన్నై నుంచి ఇతర ప్రాంతాలకు ప్రయాణ చార్జీలు వివరాలు యాప్‌లో పొందవచ్చు. అలాగే, ప్రయాణికులు తమ మొబైల్ నంబరును ఉపయోగించి తమ ప్రయాణ అనుభావలతో పాటు కేఎంబీటీ సౌకర్యాలను కూడా తెలుపవచ్చు. తమిళం, ఆంగ్ల భాషల్లో ఈ యాప్ అందుబాటులో ఉందని సీఎండీఏ అధికారులు వెల్లడించారు.



ఉపకార వేతనం పెంచాలని
రోడ్డెక్కిన దివ్యాంగుల అరెస్ట్



రాస్తారోకో చేస్తున్న దివ్యాంగులు

ప్యారీస్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తర చెన్నైలోని తిరువొత్తియూర్‌లో ఉపకార వేతనం పెంచాలని కోరుతూ మంగళవారం రాస్తారోకోలో పాల్గొన్న దివ్యాంగులను పోలీసులు అరెస్టు చేశారు. తిరువొత్తియూర్ తాహసీల్దార్ కార్యాలయం సమీపంలో గుమిగూడిన సుమారు 200 మంది దివ్యాంగులు రోడ్డుపై బైటాయించి రెవెన్యూ శాఖలో తాము సమర్పించిన వినతిపత్రంలో డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రాలో లాగే దివ్యాంగులకు ఉపకార వేతనం పెంచాలని నినాదాలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన హామీల్లో ముఖ్యమంత్రి స్టాలిన్ అమలుపరచాలని వారు డిమాండ్ చేశారు. అనుమతి లేకుండా నిర్వహించిన ఈ రాస్తారోకో వల్ల తిరువత్తియూర్ హైరోడ్డులో సుమారు గంటపాటు వాహనాల రాకపోకలను అంతరాయం ఏర్పడింది. దీనితో పోలీసులు ఆందోళనాకారులను అరెస్టు చేసి పోలీసు వాహనాల్లో స్థానికంగా ఉన్న ఓ కల్యాణమండపానికి తరలించారు.

కారైక్కుడి అళగప్పా విశ్వవిద్యాలయంలో గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్





ఉన్నత విద్యలో
మనమే ఫస్ట్

అళగప్పా వర్సిటీ సభలో సీఎం స్టాలిన్

చెన్నై, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన ఉన్నత విద్యనందించడంలో ఇతర రాష్ట్రాలకంటే ముందంజలో ఉన్నామని, గత మూడున్నరేళ్లలో 32 ప్రభుత్వ ఆర్ట్స్‌సైన్స్ కళాశాలలను ప్రారంభించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. శివగంగ జిల్లా కారైక్కుడి అళగప్పా విశ్వవిద్యాలయంలో మంగళవారం కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ పి.చిదంబరం సమకూర్చిన రూ.12 కోట్లతో ఆయన తల్లి లక్ష్మి పేరుతో నిర్మించిన తమిళభాషాభివృద్ధి గ్రంథాలయాన్ని ప్రారంభించారు. అదే విధంగా ఆ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థులు, దాతలు అందించిన రూ.5 లక్షలతో తయారుచేసి విశ్వవిద్యాలయం అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ వద్ద ఏర్పాటు చేసిన తిరువళ్లువర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో స్టాలిన్ మాట్లాడుతూ విద్యాప్రదాత అళగప్పర్ నడయాడిన ప్రాంతంలో జరిగిన సభలో తాను పాల్గొనటం అదృష్టంగా భావిస్తున్నానని, విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, తమిళ భాషాభివృద్ధికి కూడా ఎంతో కృషి చేసారని కొనియాడారు. చిదంబరం తన మాతృమూర్తి పేరుతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని, ఆయనే ఓ నడయాడే గ్రంథాలయం అని, రాజకీయ, చారిత్రక, ఆర్థిక, సాహిత్య రంగాల్లో అపారమైన అనుభవం ఆయనకు ఉందని ప్రశంసించారు. విద్యార్థుల మేథో వికాసానికి గ్రంథాలయాలు అవసరమని, విద్యా ప్రదాతలు, పారిశ్రామికవేత్తలు తమకు తోచినంత విరాళాలను సేకరించి తమ ప్రాంతాల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేసుకుంటే మంచిందని స్టాలిన్ సూచించారు. ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన తర్వాత తనకు శాలువలు, పుష్పగుచ్చాలు ఇవ్వటానికి బదులుగా మంచి పుస్తకాలను కానుకలుగా ఇవ్వాలని విజ్ఞప్తి చేశానని, ఇప్పటివరకూ తనకు కానుకలుగా వచ్చిన 2.75లక్షల పుస్తకాలను వివిధ గ్రంథాలయాలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. చిదంబరం ఏర్పాటు చేసిన గ్రంథాలయానికి కూడా 1000 పుస్తకాలను అందజేస్తానని, అదే విధంగా గ్రంథాలయం అభివృద్ధికి ప్రభుత్వ పరంగాను అన్ని విధాలా సాయం చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో కొన్ని దుష్టశక్తులు తిరువళ్లువర్‌ను, వళ్ళలార్ కీర్తి ప్రతిష్ఠలను దిగజార్చేందుకు ప్రయత్నిస్తున్నాయని, తిరువళ్లువర్ మానవాళి జీవనవిధానానికి సూక్తులను బోధిస్తే వళ్లలార్ జీవహింస వ్యతిరేక ఉద్యమం నిర్వహించారని ఆయన కొనియాడారు. నాణ్యమైన ఉన్నత విద్యను అందించడంలో ముందంజలో ఉండటం వల్లే ప్రజల ద్వారా ఎన్నికైన ముఖ్యమంత్రి విశ్వవిద్యాలయాలకు ఛాన్సలర్‌గా ఉండాలని డిమాండ్ చేస్తున్నామని ఈ సందర్భంగా స్టాలిన్ పేర్కొన్నారు. అంతకు ముందు విశ్వవిద్యాలయంలోని సదస్సు హాలుకు 'వీరుకవియరసర్ ముడియరసనార్ అరంగం' అనేపేరు పెట్టారు. మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి ముగింపు వేడుకల జాతీయ సదస్సు వ్యాసాల సంపుటిని ఆయన ఆవిష్కరించి, వాటిని అళగప్పా విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ కే రవికి అందజేశారు. ప్రముఖ కవి అన్నాదాసన్ రచించిన 'ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రాథమిక తమిళం' పేరుతో రచించిన గ్రంథాన్ని కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, తంగం తెన్నరసు, ఎస్.రఘుపతి, కేఆర్ పెరియకరుప్పన్, సామినాథన్, ఆర్ఎస్ రాజకన్నప్పన్, కోవి చెళియన్, సీవీ మెయ్యనాథన్, ఎంపీ కార్తీ చిదంబరం, శాసనసభ్యులు ఎస్.మాంగుడి, తమిళరసి, డాక్టర్ వి.ముత్తురాజా తవత్తిరు కుండ్రక్కుడి పొన్నంబళ అడిగళార్, ప్రముఖ తమిళ సినీ గేయరచయిత వైరముత్తు, జిల్లా కలెక్టర్ ఆషా అజిత్, అళగప్పా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఎ.సెంథిల్‌రాజన్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షానికి తడిసిన పంటలు

● నేడు కేంద్రం నుంచి రానున్న పరిశీలకులు



నాగపట్టినంలో తడిసిన వరిపైరుతో రైతు

చెన్నై, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కావేరి డెల్టా జిల్లాల్లో కుండపోతగా కురిసిన భారీ వర్షాల కారణంగా పంట నష్టం ఏర్పడిన ప్రాంతాల్లో పర్యటించే నిమిత్తం కేంద్ర పరిశీలక బృందం బుధవారం రానుంది. ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట నీటమునిగింది. ముఖ్యంగా మైలాడుదుర్రై, నాగపట్టినం, తంజావూరు జిల్లాల్లో సుమారు లక్ష ఎకరాల్లో వేసిన వరి, మినుము, పెసర పంటలు వాననీటిలో తడిసిపోయాయి.వరి కొనుగోళ్ల కేంద్రాల్లో ప్రస్తుతం 17 శాతం తేమ కలిగిన వరిని మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం కురిసిన భారీ వర్షాలకు వరిపంట బాగా తడిసిపోవటంతో 22 శాతం తేమ కలిగిన వరిని కొనుగోలు చేసేందుకు అనుమతించాలని వామపక్షాల నేతలు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఆహార భద్రతా విభాగం అదనపు ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ జె.రాధాకృష్ణన్ ఢిల్లీ వెళ్ళి కేంద్ర ఆహారశాఖ కార్యదర్శి సంజీవ్ చోప్రాను కలిసి డెల్టా జిల్లాల్లో నీట మునిగిన పంటలు గురించి వివరించారు. దీంతో పంట నష్టాలను పరిశీలించేందుకు ప్రత్యేక కమిటీ రాష్ట్రానికి పంపుతున్నట్లు సంజీవ్ చోప్రా తెలిపారు. ఆ ప్రకారం కేంద్ర ఆహార, పరిశోధన శాఖలకు చెందిన డిప్యూటీ డైరెక్టర్లు నవీన్, టీఎం ప్రీతి, సాంకేతిక సభ్యులు రాహుల్, అభిషేక్ పాండే తదితరుల సభ్యుల కమిటీ బుధవారం నుంచి రాష్ట్రంలో పర్యటించనుందని ఆయన చెప్పారు. ఈ బృందం డెల్టా జిల్లాల్లో తడిసిన పంటను పరిశీలించి, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తనిఖీ చేయనుందని తెలిపారు. కమిటీ సభ్యులు సమర్పించే నివేదిక బట్టి కేంద్రం ధాన్యం కొనుగోలు కేంద్రాలలో 22 శాతం తేమ కలిగిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేలా ఉత్తర్వులిచ్చే అవకాశం కూడా ఉందని తెలిపారు.

మాజీ మంత్రికి హైకోర్టు నోటీసు



రాజేంద్ర బాలాజీ

ప్యారీస్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే నేత, మాజీమంత్రి రాజేంద్రబాలాజీకి మద్రాస్ హైకోర్టు నోటీసులిచ్చింది. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో పాడి పరిశ్రమల శాఖా మంత్రిగా వ్యవహరించిన రాజేంద్రబాలాజీ, అన్నాడీఎంకే నాయకుడు విజయ నల్లతంబి ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురిని నమ్మించి నగదు మోసానికి పాల్పడినట్లు విరుదునగర్ జిల్లా ఆర్థిక నేరవిభాగంలో రవీంద్రన్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. 2021వ సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ కేసుకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై చార్జిషీటు దాఖలు చేసేలా పోలీసులకు ఉత్తర్వులివ్వాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అందులో ఉద్యోగాల కోసం నగదు ముట్టజెప్పి మోసపోయిన వారిని రాజేంద్ర బాలాజీ బెదిరించినట్లు ఆధారాలతో సమర్పించిన ఫిర్యాదుపై పోలీసులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, దీనిపై ఉన్నతస్థాయి విచారణకు ఉత్తర్వులు జారీ చేయాలని పిటిషనర్ కోరారు. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిపిన మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి వేలుమురుగన్.. నాలుగు వారాల్లోగా సమగ్ర వివరాలు దాఖలు చేయాలని ఆదేశిస్తూ రాజేంద్ర బాలాజీకి నోటీసు జారీ చేశారు.

రాయపురంలో తాత్కాలిక బస్టాండ్

అద్దె, డిపాజిట్‌గా హార్బర్‌కు జీసీసీ రూ.7.73 కోట్ల చెల్లింపు



బ్రాడ్ వే బస్టాండ్

పెరంబూర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపురంలో తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటు కోసం గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) చెన్నై హార్బర్‌కు అద్దె, డిపాజిట్‌గా రూ.7.73 కోట్లు చెల్లించింది. నగరంలో ప్రాచీన బస్టాండ్‌గా బ్రాడ్‌వేకు పేరుంది. 1949లో ఈ బస్టాండ్ అందుబాటులోకి రాగా, తొలుత దక్షిణాది జిల్లాలకు వెళ్లే బస్సులను ఇక్కడి నుంచే నడిపేవారు. అనంతరం స్థలాభావం కారణంగా కోయంబేడు బస్ టెర్మినల్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సులను మార్చారు. ప్రస్తుతం సిటీ బస్సులు మాత్రమే బ్రాడ్ వే బస్టాండ్ నుంచి నడుపుతున్నారు. బస్టాండ్ సమీపంలో పూలు, పండ్లు దుకాణాలుండడంతో ఎల్లప్పుడూ ఈ ప్రాంతం రద్దీగా ఉంటుంది.

'మల్టీ మోడల్ ఇంటిగ్రేషన్'...

ప్రస్తుతమున్న బ్రాడ్ వే బస్టాండ్ స్థానంలో కొత్త బస్టాండ్ నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం, 'మల్టీ మోడల్ ఇంటిగ్రేషన్' పేరుతో బహుళ రవాణా బస్టాండ్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించారు.ఆ ప్రకారం, మెట్రో రైల్వేస్టేషన్, సబర్బన్ రైల్వే స్టేషన్ అనుసంధానం చేసేలా 7 ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు ఏర్పాటుకానున్నాయి. బస్టాండ్ నిర్మాణం చేపట్టే సమయంలో, ప్రయాణికుల సౌకర్యార్థం ఈ బస్టాండ్‌ను ఐల్యాండ్ గ్రౌండ్స్‌కు తరలించారని నిర్ణయించారు. ఇందుకోసం జీసీసీ రూ.5 కోట్లు కేటాయించింది. కానీ, ఐల్యాండ్ గ్రౌండ్స్‌కు బదులు రాయపురం ఎన్నార్టీ ఫ్లై ఓవర్ సమీపంలో తాత్కాలికంగా ఏర్పాటుచేయాలని నిర్ణయించారు.

57 బస్సులు నిలిపేలా...

చెన్నై హార్బర్‌కు చెందిన ఈ స్థలంలోనే తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటుకానుంది. ఇందుకు సంబంధించిన టెండరు కూడా విడుదలైంది. 57 బస్సులు నిలిపేలా ఈ బస్టాండ్ నిర్మాణం చేపట్టనున్నారు. బస్సులు రద్దీలో చిక్కుకోకుండా నడిచేలా మూడు ప్రవేశ మార్గాలు, ప్రయాణికుల కోసం సిటింగ్, టాయిలెట్లు, తాగునీరు, టైమ్ కీపర్ గది, పైకప్పుతో కూడిన తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటుకానుంది. ఈ బస్టాండ్ ఏర్పాటుకు చెన్నై హార్బర్ పలు నిబంధనలు విధించింది.

ఏడాదికి అద్దె రూ.3.86 కోట్లు...

చెన్నై హార్బర్‌కు చెందిన 14,014 చ.మీ విస్తీర్ణంలో ఇబ్రహీం రోడ్డులో ఉన్న స్థలాన్ని చెన్నై కార్పొరేషన్‌కు మూడేళ్ల అద్దెకు ఇవ్వడంతో పాటు, మెట్రోపాలిటన్ కార్పొరేషన్ (ఎంటీసీ) బస్సులు నడిపేందుకు అనుమతించారు. అందుకోసం అద్దె డిపాజిట్‌గా చ.మీ రూ.230 (జీఎస్‌టీతో కలిపి) నిర్ణయించారు. ఈ మేరకు రూ.7.73కోట్ల డిపాజిట్‌ను సోమవారం జీసీసీ హార్బర్‌కు చెల్లించింది. ఈ ప్రాంతంలో నిర్మాణాల అనుమతి సర్టిఫికెట్‌ను మంగళవారం హార్బర్ యజమాన్యం అందజేసింది. ఆరు నెలల్లో పనులు పూర్తిచేసి ఈ తాత్కాలిక బస్టాండ్ అందుబాటులోకి తీసుకురావాలని జీసీసీ నిర్ణయించింది.

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా కోయంబేడు, కుమరన్‌చావిడి ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

కోయంబేడు: జయ నగర్, అమరావతి నగర్, ప్రగతీశ్వర్ నగర్, శక్తి నగర్, వళ్లువర్ రోడ్డు, బాలవినాయకర్ నగర్, తిరువీధి అమ్మన్ ఆలయ వీధి, డా.అంబేడ్కర్ వీధి, టీఎస్టీ నగర్, జానకిరామన్ కాలని, వందడుగుల రోడ్డులో కొంత భాగం, ఎస్ఏఎఫ్ గేమ్స్ విలేజ్, అళగిరి నగర్, చిన్మయ నగర్, లోకనాధన్ నగర్, ఇందిరా గాంధీ వీధి, మంగాళి నగర్. **కుమరన్‌చావిడి:** గోల్డన్ ప్లాట్స్ 1, గోల్డన్ ప్లాట్స్ 2, పూందమల్లి బైపాస్, బీఎస్ఎన్ఎల్, ఎంటీసీ డిపో.

రేపటి నుంచి బీఎస్ఎన్ఎల్ ఫ్యాన్సీ నెంబర్ల వేలం

పెరంబూర్, జనవరి21(ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ రీజియన్ పరిధిలో ఈ నెల 23వ తేది ఆన్‌లైన్‌లో ఫ్యాన్సీ నెంబర్లకు వేలం జరుగనుంది. ఆసక్తి కలిగిన వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ ఫ్యాన్సీ నెంబర్లను www. eauction. bsnl.co.in అనే వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు. గురువారం నుంచి ఈ నెల 29త తేది వరకు అదే వెబ్‌సైట్‌లో వేలం ఉంటుందని అధికారులు తెలిపారు.

13, 14 తేదీల్లో రవాణా శాఖ ఉద్యోగుల వేతన ఒప్పంద చర్చలు

పెరంబూర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖ ఉద్యోగులకు 15వ వేతన ఒప్పందంపై ఫిబ్రవరి 13,14 తేదీల్లో చర్చలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర రవాణా శాఖలో 1.11 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, మూడేళ్లకు ఒకసారి వేతనం పెంపు జరుగుతోంది. ఆ ప్రకారం, 14వ వేతన పెంపు 2023 ఆగస్టుతో ముగిసిన నేపథ్యంలో, 15వ వేతన సంఘం సమావేశం నిర్వహించాలని కార్మిక సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో క్రోంపేటలోని మెట్రో ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) శిక్షణా కేంద్రంలో రవాణా శాఖ మంత్రి పి.శివశంకర్ నేతృత్వంలో ఫిబ్రవరి 14,15 తేదీల్లో జరుగుతాయని, చర్చల్లో పాల్గొనాలని 80 కార్మిక సంఘాలకు ఆహ్వానాలు పంపినట్లు అధికారులు తెలిపారు.

కో-ఆప్‌టెక్స్ ఉద్యోగులకు టాయిలెట్ అలవెన్స్ రూ.300

పెరంబూర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కో-ఆప్‌టెక్స్ ఆధ్వర్యంలోని టాయిలెట్ లేని దుకాణాల్లో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులకు, టాయిలెట్ సౌకర్యానికి నెలకు రూ.300 ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని 105 విక్రయ కేంద్రాల్లో, 30 కేంద్రాల్లో టాయిలెట్ సౌకర్యంల లేదు. దీంతో, దుకాణాల్లో పనిచేసే ఉద్యోగులు సమీపంలో బస్టాండ్లు, ఇతర ప్రాంతాల్లో టాయిలెట్లను ఆశ్రయిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో నగదు వసూలుచేస్తున్నారని ఉద్యోగులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై దృష్టి సారించిన ప్రభుత్వం, టాయిలెట్ సదుపాయం లేని దుకాణాల్లో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులకు టాయిలెట్ అలవెన్స్ నెలకు రూ.300 ఇవ్వాలని నిర్ణయించడంతో పాటు, ఆయా దుకాణాల్లో టాయిలెట్ ఏర్పాటును పరిశీలిస్తున్నట్లు తెలియజేసింది.

ప్రకృతి వైద్య కోర్సుల్లో 272 ఖాళీలు

పెరంబూర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): యోగా, ప్రకృతి వైద్యం కోర్సుల్లో ప్రస్తుత విద్యా సంవత్సరం 272 సీట్లు భర్తీ కాలేదు. జాతీయ వైద్యం హోమియోపతి శాఖ ఆధ్వర్యంలో అరుంబాక్కం అరింజర్ అన్నా ప్రభుత్వ భారత వైద్య ఆసుపతి ప్రాంగణంలో సిద్ధ వైద్య కళాశాల, యునానీ వైద్య కళాశాల, తిరునల్వేలి జిల్లా పాళయంకోటలో సిద్ధ వైద్య కళాశాల, మదురై జిల్లా తిరుమంగళంలో హోమియోపతి వైద్య కళాశాల, కన్నియాకుమారి జిల్లా కోట్టారులో ఆయుర్వేద వైద్యశాలలున్నాయి. ఈ ఐదు ప్రభుత్వ కళాశాలల్లో సిద్ధ, ఆయుర్వేదం, యునానీ, హోమియోపతి కోర్సుల్లో 330 సీట్లు, 30 ప్రైవేటు కళాశాలల్లో 1,980 సీట్లు ఉన్నాయి. ఈ సీట్ల భర్తీ కౌన్సెలింగ్‌ను పలువిడతలుగా నిర్వహించిన తర్వాత కూడా 272 సీట్లు భర్తీ కాలేదని అధికారులు తెలిపారు.

అంబత్తూరులో ఐదుగురు రౌడీల అరెస్ట్

ప్యారీస్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆవడి సమీపంలోని ఆయల్‌చ్చేరి ప్రాంతంలో ఇటీవల అన్నదమ్ములను హత్యచేసిన వ్యవహారంపై అంబత్తూరు పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఆయల్‌చ్చేరికి చెందిన రెట్టమలై శ్రీనివాసన్(27), స్టాలిన్(24)అనే సోదరులు ఆ ప్రాంతంలో రౌడీలుగా చలామని అయ్యారు. గత 18వ తేదీ రాత్రి వీరు హత్యకు గురికాగా, ఎడుగురిని అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో ప్రధాన నిందితులను అరెస్టు చేసేందుకు చర్యలు చేపట్టిన పోలీసులు సోమవారం వరకు 72 మంది మాజీ నేరస్థులను అరెస్టు చేశారు. వీరిలో కోర్టు ఉత్తర్వుల మేరకు 16 మందిని జైలుకి తరలించి, మిగిలిన రౌడీలను హెచ్చరించి పంపించారు. ఇదిలా ఉండగా, పోలీసు కమీషనర్ ఉత్తర్వుల మేరకు పాడీకి చెందిన వినోద్ (28), కిషోర్ (27), అరుణ్‌కుమార్ (28), కమల్ (19), నవీన్‌కుమార్ (25)అనే రౌడీలను అరెస్టుచేసినట్లు పోలీసులు తెలిపారు.

పాంబన్ రైలు వంతెనకు స్వస్తి!

త్వరలో తొలగింపు పనులు ప్రారంభం ● 111 ఏళ్లనాటి వంతెనకు వీడ్కోలు

టి.నగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పాంబన్ రైల్వే వంతెన నిర్మాణ పనులు పూర్తయి, త్వరలో కొత్త వంతెనను ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించనున్న నేపథ్యంలో 111 యేళ్లపాటు చెక్కుచెదరకుండా సమర్థవంతంగా ఉపయోగపడిన పాత పాంబన్ రైలు సస్పెన్షన్ బ్రిడ్జిని తొలగించాలని నిర్ణయించారు. 19వ శతాబ్దం చివరలో రూ.2.60 కోట్లతో ధనుష్కోడి నుంచి శ్రీలంకలోని తలైమన్నార్ వరకు కడలిపై రైలు వంతెన నిర్మించాలని ఒక ప్రాజెక్టు అంచనా రూపొందించిన అప్పటి ఆంగ్లేయ పాలకులు ఏ కారణాల వల్లనో ఆ ప్రాజెక్టును అమలు చేయకుండా విరమించుకున్నారు. ఆ తరువాత రామేశ్వరం ద్వీపాన్ని కలిపే రీతిలో పాంబన్ నుండి మండపం వరకు సముద్రంపై రైలు వంతెన, దాని మధ్యలో సముద్రంలో పడవలు సాఫీగా రాకపోకలు సాగించేలా సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మించేందుకు 1911లో ఆంగ్లేయ పాలకులు పూనుకున్నారు. రెండేళ్లలో వంతెన, సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. 1914 ఫిబ్రవరి 24న ఆ వంతెనపై రైళ్లు పరుగులు తీశాయి. అప్పటి నుండి వందేళ్లకుపైగా ఆ వంతెన రామేశ్వరం దీవికి ప్రయాణికులను సురక్షితంగా చేర్చగలిగింది. అయితే వంతెన నడుమనున్న సస్పెన్షన్ బ్రిడ్జి పైకి, కిందకు కదుపుతుండడంతో తరచూ సాంకేతిక లోపాలు ఏర్పడుతుండేవి. పైకి లేపిన సస్పెన్షన్ బ్రిడ్జి కిందకు దిగడం కష్టసాధ్యమయ్యేది. దీనికి తోడు ఆ సస్పెన్షన్ బ్రిడ్జిలో అక్కడక్కడా బీటలు, పగళ్లు ఏర్పడ్డాయి. దీంతో ఆ వంతెన సమీపంలోనే కొత్త రైలు వంతెన నిర్మాణానికి 2019 మార్చి 1న ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం అన్ని పనులు పూర్తి చేసుకుని కొత్త రైలు వంతెన ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈ నేపథ్యంలో పాత రైలువంతెన మధ్యనున్న సస్పెన్షన్ బ్రిడ్జిని తొలగించే పనులు ప్రారంభమయ్యాయి. దక్షిణ రైల్వే ఇంజనీరింగ్ అధికారులు 30 మంది కార్మికులతో ఆ సస్పెన్షన్ బ్రిడ్జిని పైకి లేపి, కిందకు దించేందుకు ప్రయత్నించారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ఇరువైపులా 15 మంది కార్మికులు, మెకానిక్‌లు కలిసి సస్పెన్షన్ బ్రిడ్జిని రెండు వైపులా పైకి లేపేందుకు చర్యలు చేపట్టారు. సాధారణంగా ఈ సస్పెన్షన్ బ్రిడ్జిని రెండు భాగాలుగా పైకి లేపటానికి పావుగంటపట్టేంది. అయితే పది నెలలుగా సస్పెన్షన్ బ్రిడ్జి ఉపయోగంలో లేకపోవడంతో దానిని పైకి లేపటానికి గంట పట్టింది. సాయంత్రం ఆరుగంటలకు ఆ బ్రిడ్జిని కిందకు దింపి యథాస్థితికి తెచ్చారు. 11 దశాబ్దాలకుపైగా రైలు ప్రయాణికులకు సేవలందించిన ఆ సస్పెన్షన్ బ్రిడ్జిని స్మారక చిహ్నంగా మార్చేందుకు రైల్వే అధికారులు నిర్ణయించారు. సముద్రంలో ఉన్న ఆ సస్పెన్షన్ బ్రిడ్జిని తొలగించి పాంబన్ రైల్వేస్టేషన్, లేదా మండపం రైల్వేస్టేషన్ వద్ద అమర్చి, దానిని ప్రజలు దగ్గరగా వీక్షించేలా మ్యూజియం తరహా షెడ్డు కూడా నిర్మించాలని భావిస్తున్నారు. ఈ విషయమై త్వరలో ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతామని రైల్వే శాఖ ఉన్నతాధికారులు తెలిపారు.


పాంబన్ పాత సస్పెన్షన్ బ్రిడ్జి

రాష్ట్రంపై రూ.10 లక్షల కోట్ల రుణభారం

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

ప్యారీస్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ప్రభుత్వం రుణంగా పొందిన రూ.10 లక్షలకోట్లు తిరిగి చెల్లించేందుకు మరికొన్నేళ్లు పడుతోందని, డీఎంకే ప్రభుత్వం కనీస అవసరాలకు ఈ రుణాన్ని వెచ్చించలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై వ్యాఖ్యానించారు. అన్నామలై మంగళవారం మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వ నిర్వాహణ లోపంవల్ల రాష్ట్ర ప్రజలపై రుణ భారం పెరుగుతూ వస్తోందని ఆరోపించారు. రూ.3లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టే ప్రభుత్వం రూ.60వేల కోట్ల నుంచి రూ.70వేలకోట్ల వరకు ఏ పథకాల కోసం ఖర్చు పెడుతోందో స్పష్టతలేదన్నారు. ఆరోసారి ప్రభుత్వం ఏర్పాటు చేసిన డీఎంకే విద్యా, ఉద్యోగ రంగంలో వెనుకబడిన ఎస్సీఎస్టీ వర్గాల విద్యార్థులను ఉన్నతస్థాయికి ఏ విధంగా తీసుకువెళ్లిందో ఆదిద్రావిడ సంక్షేమ శాఖామంత్రి మదివేందన్ సమాధానం చెప్పాలని అన్నామలై డిమాండ్ చేశారు.

గోమూత్రం తాగితే టాస్మాక్ విక్రయాలు తగ్గుతాయి...!

● తమిళిసై సౌందర్‌రాజన్

పెరంబూర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): గోమూత్రం తాగితే టాస్మాక్ విక్రయాలు తగ్గుతాయని కొందరు భావిస్తున్నారని బీజేపీ సీనియర్ నేత తమిళిసై ఎద్దేవా చేశారు. గో మూత్రం తాగితే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని మద్రాసు ఐఐటీ డైరెక్టర్ కామకోడి వ్యాఖ్యలు రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారాయి. ఆయన వ్యాఖ్యలను పలువురు ఖండించారు. ఈ నేపథ్యంలో, నగరంలో జరిగిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న తమిళిసై మీడియాతో మాట్లాడుతూ... బీఫ్ తినేవారు, ఆవుల పేడ వినియోగించేవారు, గో మూత్రంలో ఔషధ గుణాలున్నాయంటే వ్యతిరేకిస్తున్నారన్నారు. వారు ఆయుర్వేదంలో మందుగా గో మూత్రం వినియోగించరాదని మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని ఆమె వ్యాఖ్యానించారు.

ఐఐటీఎం డైరెక్టర్‌గా కామకోడి అనర్హుడు

● ఎస్‌డీపీఐ నేత నెల్లై ముబారక్

అడయార్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఐఐటీఎం డైరెక్టరుగా కామకోడి అనర్హుడని ఎస్‌డీపీఐ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు నెల్లై ముబారక్ అన్నారు. ఇదే విషయంపై ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 15న మాంబాళంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న కామకోడి... ఆవు గోమయంలో ఔషధ గుణాలున్నాయంటూ వ్యాఖ్యానించారు. అవి కాస్త వివాదాస్పదమయ్యాయి. కామకోడి వ్యాఖ్యలను ఇప్పటికే టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై ఖండించారు. ఇపుడు ఎస్‌డీపీఐ అధ్యక్షుడు నెల్లై ముబారక్ తీవ్రంగా ఖండిస్తూ, మద్రాస్ ఐఐటీకి కామకోడి వంటి అజ్ఞాని డైరెక్టరుగా ఉండటం దురదృష్టకరమన్నారు. ఆయనను తక్షణం ఆ పదవి నుంచి తొలగించాలని ముబారక్ డిమాండ్ చేశారు.

రెండు రోజులు తాగునీటి సరఫరాకు అంతరాయం

పెరంబూర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆలందూర్ మండలంలో ప్రధాన తాగునీటి పైపులు మార్చనున్న కారణంగా చెన్నై కార్పొరేషన్ పరిధిలోని ఐదు మండలాలకు రెండు రోజులు తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఈ మేరకు మెట్రో వాటర్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో... ప్రధాన తాగునీటి పైపులు మార్చనున్న కారణంగా 9,10,11,12,13 మండలాల పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో బుధవారం రాత్రి 9 గంటల నుంచి 24వ తేది రాత్రి 9 గంటల వరకు తాగునీటికి సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఆ ప్రకారం, తేనాంపేట మండల పరిధిలోని ఎమ్మార్సీ నగర్, కోడంబాక్కం మండల పరిధిలోని ఈకాట్టుతాంగళ్, వలసరవాక్కం, రామాపురం, ఆలందూర్ మండల పరిధిలోని ముగలివాక్కం, మనపాక్కం, నందంబాక్కం, ఆలందూర్, నంగనల్లూర్, ఆదంబాక్కం, మీనంబాక్కం, అడయార్ మండల పరిధిలోని పల్లిపట్టు, వేళచ్చేరి, తాంబరం కార్పొరేషన్ పరిధిలోని కౌల్ బజార్, పొలిచ్చనల్లూర్ తదితర ప్రాంతాల్లో రెండు రోజులు తాగునీటి సరఫరా ఉండదని పేర్కొంది. ప్రజలు రెండు రోజులకు సరిపడా నీటిని నిల్వచేసుకోవాలని, అత్యవసర తాగునీటి కోసం https://cmwssb.tn.gov.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు. మరిన్ని వివరాలకు 044-45674567 అనే నెంబరు సంప్రదించవచ్చని వాటర్ బోర్డు తెలియజేసింది.

నగరంలో 'స్వచ్ఛభారత్'


తేనాంపేట మండలం సెల్వన్ మాణిక్యం రోడ్డును శుభ్రం చేస్తున్న కార్మికులు

పెరంబూర్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నై కాలుష్య, చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దేలా గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పలు చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా, అంతర్ రోడ్లు, బస్ షెల్టర్లు, పార్కులు, శ్మశానవాటికలు, ఫ్లై ఓవర్లు, సొరంగ మార్గాల్లో మాస్ క్లీనింగ్ చేపడుతోంది. ఈ ప్రకారం, జీసీసీ పరిధిలో ఫుట్‌పాత్‌లు శుభ్రం చేసే పనులు ఆదివారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈ నెల 27వ తేది వరకు రాత్రి వేళల్లో జరుగనున్న ఈ పనుల్లో పారిశుధ్య కార్మికులు పాల్గొంటున్నారని జీసీసీ ఒక ప్రకటనలో తెలిపింది.

సొంతంగా విమానం కొనుగోలు చేయడం లేదు

● రాష్ట్రప్రభుత్వం ప్రకటన

ప్యారీస్,జనవరి21(ఆంధ్రజ్యోతి): సొంత విమానం, హెలికాప్టర్లను కొనుగోలు చేసే ఆలోచన లేదని రాష్ట్రప్రభుత్వం స్పష్టం చేసింది. దేశంలో ఢిల్లీ, ఛత్తీస్‌గడ్, మహారాష్ట్ర, జమ్ముకశ్మీర్, గుజరాత్, మధ్యప్రదేశ్ తదితర పలు రాష్ట్రాల ప్రభుత్వాలకు సొంతంగా హెలికాప్టర్లున్నాయి. ఇవి పలు సమయాల్లో ప్రభుత్వాలకు ఉపయోగపడుతున్నాయి. వరదలు సంభవించిన రోజుల్లో నీటిమునిగిన పంటలను, ప్రాంతాలను విమానంలో ప్రయాణం చేస్తూ ముఖ్యమంత్రులు, ఉన్నతాధికారులు పరిశీలిస్తుంటారు. సొంత హెలికాప్టర్ లేని రాష్ట్రాల్లో ప్రవేటు సంస్థల నుంచి అద్దెకు తీసుకొని ఏరియల్ వ్యూ చేస్తుంటారు. ఈ నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వానికి సొంతంగా విమానం, హెలికాప్టర్లు లేవని సమాచార హక్కు చట్టం కింద ఓ పౌరుడు పెట్టిన దరఖాస్తుతో ఈ విషయం వెలుగు చూసింది. ఇదిలా ఉండగా సొంత విమానం, హెలికాప్టర్లను కొనుగోలు చేసే యోచన లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

పారిశుధ్య కార్మికురాలి నిజాయితీ


ఇన్‌స్పెక్టర్‌కు బ్యాగు అందజేస్తున్న భాను

పెరంబూర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై లభించిన నగదుతోఉన్న బ్యాగును పోలీస్ స్టేషన్‌లో అప్పగించిన పారిశుధ్య కార్మికురాలిని పలువురు అభినందించారు. కడలూరు జిల్లా కాట్టుమన్నార్‌కోయిల్ రోడ్లపై భాను అనే పారిశుధ్య కార్మికురాలు పనిచేస్తోంది. డ్యూటీలో భాగంగా రోడ్డు పక్కనే పడి ఉన్న సంచి గమనించి, అందులో నగదు ఉన్నట్లు గుర్తించి, పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అప్పగించింది. పోలీసుల విచారణలో, ఆ బ్యాగు నందిని అనే మహిళకు చెందిందని గుర్తించి, ఆమెను స్టేషన్‌కు పిలిపించి బ్యాగు అందజేశారు. నిజాయితీగా వ్యవహరించిన భానును ఇన్‌స్పెక్టర్ ఆర్ముగం సత్కరించి అభినందించారు.

కల్లుగీత కార్మికుల ఉద్యమానికి సీమాన్ మద్దతు


దర్నాలో కల్లు సేవిస్తున్న నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్

చెన్నై, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కల్లుగీతను అనుమతించాలని కోరుతూ విల్లుపురం జిల్లా పూరిగుడిసై ప్రాంతం వద్ద మంగళవారం జరిగిన కల్లుగీతకార్మికుల ఆందోళనకు నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్ మద్దతు ప్రకటించారు. కల్లుగీత కార్మికుల ప్రాంతీయ సదస్సు ప్రాంతంలో తాటి ఆకులో కల్లు పోసుకుని తాగి సీమాన్ మద్దతు ప్రకటించారు. ఈ ఆందోళనకు కల్లుగీత ఉద్యమం సమన్వయకర్త నల్లసామి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా సీమాన్ మాట్లాడుతూ ఆరోగ్యానికి మేలు చేసే తాటికల్లును రాష్ట్ర ప్రభుత్వం 38 యేళ్లుగా అనుమతించకపోవడం గర్హనీయమన్నారు. కల్తీసారా మృతుల సంఘటనలు అధికమవుతున్న ప్రస్తుత పరిస్థితులలో కల్లుగీత కార్మికులను కాపాడేలా ప్రభుత్వం కల్లును అనుమతించాలని ఆయన డిమాండ్ చేశారు.

అన్నావర్సిటీ అత్యాచారం కేసు

రాత్రంతా నిందితుడి విచారణ


జ్ఞానశేఖర్

చెన్నై, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయంలో విద్యార్థినిపై జరిగిన అత్యాచారం కేసులో అరెస్టయిన నిందితుడు జ్ఞానశేఖరన్‌ను పోలీసులు సోమవారం రాత్రంతా విచారణ జరిపారు. రెండు రోజులకు ముందే పోలీసులు అతడిని కోర్టు ఉత్తర్వు ద్వారా ఏడు రోజుల కస్టడీకి తీసుకున్నారు. సోమవారం సాయంత్రం పుళల్ సెంట్రల్ జైలులో ఉన్న అతడిని ఎగ్మూరు పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి విచారణ జరిపారు. ఆ సందర్భంగా పోలీసులు అతడిపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ విచారణలో జ్ఞానశేఖరన్‌కు అన్నా విశ్వవిద్యాలయంలో అన్ని విభాగాలు గురించి, ఏయే ప్రాంతాల్లో విద్యార్థినులు తమ బాయ్‌ఫ్రెండ్స్‌తో కబుర్లాడుకుంటారనే విషయాలు గురించి బాగా తెలుసునని వెల్లడైంది. అన్నా విశ్వవిద్యాలయం లోపల నుండి తప్పించుకునేందుకు వీలున్న ప్రాంతాలు కూడా అతడికి బాగా ఎరుకేనని పోలీసులు విచారణ ద్వారా తెలిసింది. జ్ఞానశేఖరన్ ఇంటి వద్ద స్వాధీనం చేసుకున్న లాప్‌టాప్‌లలో ఉన్న అమ్మాయిల ఫొటోలను చూపెట్టి, వారితో అతడికున్న సంబంధాలు గురించి కూడా పోలీసులు ఆరా తీశారు. ఈ విచారణ మంగళవారం వేకువజాము వరకు కొనసాగింది. ఆ తర్వాత మళ్ళీ మధ్యాహ్నం నుంచి అతడిని రహస్య ప్రాంతంలో విచారించారు.

ఆటో డ్రైవర్ దారుణహత్య

చెన్నై, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తండయార్‌పేట నేతాజీనగర్‌లో సోమవారం రాత్రి ఆటో డ్రైవర్ దారుణహత్యకు గురయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి అతడి బామ్మర్దిని పోలీసులు అరెస్టు చేశారు. నేతాజీ నగర్ రెండోవీధిలో అజయ్ (30) అనే ఆటో డ్రైవర్, భార్య ప్రియాతో కలిసి ఉంటున్నారు. అజయ్‌కి మద్యం అలవాటు ఉండటంతో రోజూ పీకలదాకా తాగి ఇంటికొచ్చి భార్య ప్రియతో గొడవపడుతుండేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి కూడా అతడు మద్యం మత్తులో భార్యను చితకబాదాడు. ఈ విషయం తెలుసుకుని అక్కడికి చేరువగా మరో ఇంటిలో నివసిస్తున్న ప్రియా సోదరుడు అన్బుసెల్వన్ వచ్చి అజయ్‌తో గొడవపడ్డారు. ఇద్దరూ కొట్టుకున్నారు. ఓ దశలో ఆగ్రహం చెందిన అన్బుసెల్వన్ ఇంటిలోని వేటకొడవలి తీసుకుని అజయ్‌పై దాడి జరిపాడు. దీంతో అజయ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.ఊహించిన ఈ సంఘటనను చూసి ప్రియా దిగ్భ్రాంతికి గురైంది. అన్బుసెల్వన్ ఆర్కేనగర్ పోలీసుల వద్ద లొంగిపోయాడు. పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

రోడ్డు విస్తరణను వ్యతిరేకిస్తూ

తిరుత్తణి రైతుల ఆందోళన


ఆందోళన జరుపుతున్న రైతులతో చర్చలు జరుపుతున్న కలెక్టర్

తిరుత్తణి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లాలో ప్రసిద్ధి చెందిన తిరుత్తణి ఆలయానికి రద్దీ పెరిగి కొండపైకి వచ్చే వాహనాల రాక పోకలకు అంతరాయం కలుగుతోంది. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్, రెవెన్యూ శాఖ, అటవీ శాఖ అధికారులు, ఆలయ నిర్వాహకులు రోడ్డు మార్గాన్ని వెడల్పు చేయాలని నిర్ణయించారు. అయితే దీనివల్ల తమ భూములు కూడా పోతాయని, దీనికి వేరే మార్గాన్ని ఏర్పాటు చేసుకోవాలని కోరుతూ స్థానిక రైతులు, ప్రజలు మంగళవారం ఉదయం నిరసనకు దిగారు. ఈ క్రమంలో కలెక్టర్ ప్రభుకుమార్ అక్కడికి చేరుకుని వాళ్లతో మాట్లాడి శాంతింపజేశారు.

మెదడు నిర్జీవమైన యువకుడి అవయవ దానం


మృతుడు అరుళ్ (ఫైల్ ఫొటో)

వేలూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీపురం నారాయణి ఆస్పత్రిలో తొలిసారిగా మెదడు నిర్జీవమైన యువకుడి అవయవాలు శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. ఆనైకట్టు సమీపం మహమ్మద్‌పురానికి చెందిన అరుళ్ (24) గత వారం ద్విచక్రవాహనంపై వెళుతూ ప్రమాదంలో గాయపడ్డాడు. అతడిని నారాయణి ఆస్పత్రికి తరలించగా, చికిత్స ఫలించక ఈ నెల 17న మెదడు నిర్జీవమైనట్లు వైద్యులు గుర్తించారు. వైద్యుల సూచనల మేరకు అరుళ్ అవయవాలు దానం చేసేందుకు కుటుంబసభ్యులు అంగీకరించారు. దీంతో, వైద్యుల బృందం శస్త్రచికిత్స ద్వారా తొలగించిన కిడ్నీ నారాయణి ఆస్పత్రికి, గుండె చెన్నై అపోలో, మరో కిడ్నీ చెన్నై కావేరి ఆస్పత్రి, నేత్రాలు వేలూరు సీఎంసీ ఆసుపత్రికి దానంగా అందజేశారు. వైద్యుల బృందంలో మెకెనెస్ జయరాజ్, శివానందం, మనీస్ కుమార్, ఎయిల్‌నిలవన్ తదితరులున్నారు. శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందానికి ఆసుపత్రి డైరెక్టర్ డా.బాలాజి అభినందనలు తెలిపారు.

ఈషా యోగా కేంద్రంపై ఫిర్యాదు

● కోవై పోలీసులను వివరణ కోరిన హైకోర్టు మదురై బెంచ్

ప్యారీస్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కోవై ఈషా యోగా కేంద్రానికి వ్యతిరేకంగా సమర్పించిన ఫిర్యాదుపై విచారణ జరిపి నివేదిక దాఖలు చేయవల్సిందిగా హైకోర్టు మదురై బెంచ్ పోలీసులకు ఆదేశించింది. మదురై కేకేనగర్‌కు చెందిన వాంజినాథన్ అనే న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌లో కోవై ఈషా యోగా కేంద్రంలో చిన్నారులపై అత్యాచారం గురించి కోవై జిల్లా పోలీసులు సుప్రీంకోర్టులో నివేదిక ఇచ్చారని, దీనిని ఆధారం చేసుకొని తాను మదురై అన్నానగర్ పోలీసు స్టేషనులో సమర్పించిన ఫిర్యాదుపై ఇంతవరకు ఎలాంటి చర్యలు లేవని తెలిపారు. ఈ పిటిషన్ మంగళవారం మదురై హైకోర్టు బెంచ్ న్యాయమూర్తి నిర్మల్‌కుమార్ ముందుకు విచారణకు వచ్చింది. ఇరుతరుపు వాదనల అనంతరం కోవై ఈషా యోగా కేంద్రానికి వ్యతిరేకంగా సమర్పించిన ఫిర్యాదుపై విచారణ జరిపి నివేదికగా దాఖలు చేయవల్సిందిగా పోలీసులకు ఆదేశించి, ఈ కేసు విచారణను న్యాయమూర్తి వాయిదా వేశారు.

బాలికపై అత్యాచారం: ఇద్దరి అరెస్ట్

ప్యారీస్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా అభిరామపట్టణం సమీపంలోని ఓ గ్రామంలో 16 ఏళ్ల బాలికను బెదదిరించి అత్యాచారానికి పాల్పడిన ఇద్దరు యువకులను పోక్సో చట్టం కింద అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామంలోని తోటకు బాలిక వెళ్తున్న సమయంలో ఇద్దరు యువకులు ఆమెను బలవంతంగా తోటలోకి లాక్కెళ్లి ఒకరి తర్వాత ఒకరు అత్యాచారానికి పాల్పడి పరారయ్యారు. దీనిపై పట్టుకోట మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన ఇన్స్పెక్టర్ కన్నికా నేతృత్వంలోని పోలీసుల బృందం తంజావూరులో తలదాచుకున్న నిందితులను సోమవారం పోక్సో చట్టం కింద అరెస్టు చేసి, కోర్టు ఉత్తర్వుల మేరకు జైలుకి తరలించారు.

అత్యాచారం కేసులో నిందితుడికి యావజ్జీవశిక్ష

పెరంబూర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కాంచీపురంలో బాలికపై అత్యాచారం చేసిన వ్యక్తికి న్యాయస్థానం యావజ్జీవ శిక్ష విధించింది. కాంచీపురం సమీపంలోని ఓ గ్రామంలో 2019లో ఆడుకుంటున్న ఏడేళ్ల బాలికపై అత్యాచారం చేసిన 39 ఏళ్ల వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో వాదోపవాదాలు పూర్తికావడంతో, నిందితుడికి యావజ్జీవ శిక్ష విధిస్తూ చెంగల్పట్టు పోక్సో న్యాయస్థానం మంగళవారం తీర్పు వెలువరించింది.

హత్య కేసులో 8 మందికి రెండు జీవిత కారాగార శిక్షలు

అడయార్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తిరునెల్వేలి జిల్లాలో ఇంట్లోకి ప్రవేశించి యువకుడుని హత్య చేసిన కేసులో అన్నాడీఎంకే నేత, ఓ న్యాయవాది సహా మొత్తం ఎనిమిది మందికి స్థానిక కోర్టు రెండు యావజ్జీవకారాగార శిక్షలను విధిస్తూ తీర్పునిచ్చింది. తాజాగా వెల్లడైన ఈ తీర్పు వివరాలను పరిశీలింగా 2014, అక్టోబరు 29న సెల్వరాజు అనే వ్యక్తిని అతడి ఇంటిలోనే కొందరు వ్యక్తులు హతమార్చారు.. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి అదే ప్రాంతానికి చెందిన సెంథిల్ కుమార్ (39), చంద్రన్ (65), మురుగేశన్ (45), మదియళగన్ (45), నంబిరాజన్ (41), శ్రీకాంత్ (37), విజయ్ (29), మల్లైయప్పన్ (29), ఒక బాలుడుతో సహా మొత్తం 22 మందిని అరెస్టు చేశారు. కేసు విచారణ సమయంలో సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో 13 మందిని కోర్టు విడుదల చేసింది. మిగిలిన 8 మందికి రెండు యావజ్జీవ కారాగారశిక్షలను విధిస్తూ నెల్లై కోర్టు తాజాగా తీర్పును వెలువరించింది.

ఎంపీ కదిర్ ఆనంద్ కళాశాలలో రూ.13.7 కోట్లు స్వాధీనం

పెరంబూర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ఎంపీ కదిర్ ఆనంద్‌కు చెందిన కళాశాలలో జరిపిన తనిఖీల్లో రూ.13.7 కోట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారుల సమాచారం. మంత్రి దురైమురుగన్ కుమారుడు, వేలూరు ఎంపీ కదిర్ ఆనంద్‌కు చెందిన ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల క్రితం ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. మంత్రి దురైమురుగన్ ఇల్లు, మంత్రి ప్రధాన అనుచరుడు, డీఎంకే ప్రముఖుడు పూంజోలై శ్రీనివాసన్, ఆయన బంధువు దామోదరనప్ తదితరుల ఇళ్లలోను తనిఖీలు జరిగాయి. మూడు రోజులు జరిగిన ఈ తనిఖీల్లో, డిజిటల్ నగదు పరివర్తన, కార్యాలయంలోని ఫైళ్లు, కంప్యూటర్ సమాచారం, కళాశాలలో నగదు భద్రపరిచే గది సహా పలు ప్రాంతాల్లో అధికారులు తనిఖీలు జరిపారు. తనిఖీల్లో లభ్యమైన ఆధారాలు, పత్రాల విషయమై ఈడీ ఎలాంటి ప్రకటన చేయలేదు. తాజాగా మంగళవారం వెల్లడైన సమాచారం మేరకు, ఎంపీ కదిర్ ఆనంద్ కళాశాల నుంచి రూ.13.7 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, ఎంపీ ఇంట్లో లాకర్ బద్దలుకొట్టి రూ.75 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కళాశాల నుంచి హార్డ్ డిస్క్, ఆస్తులకు సంబంధించిన దస్తావేజులు లభ్యమయ్యాయి. ఆ పత్రాలు పరిశీలిస్నట్లు, కంప్యూటర్‌లో నమోదుచేసిన వివరాలు కూడా పరిశీలిస్తున్నట్లు ఈడీ అధికారులు పేర్కొన్నారు.


చీరకు నిప్పంటుకొని మహిళ మృతి


సంగీత (ఫైల్ ఫొటో)

వేలూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి సమీపం కీల్‌వడుగన్‌తాంగల్ ప్రాంతానికి చెందిన శేఖర్ అదే ప్రాంతంలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. ఆయన భార్య సంగీత ఈ నెల 19వ తేది వంట చేసేందుకు గ్యాస్ స్టవ్ వెలిగించింది. గ్యాస్ లీకేజీ కారణంగా ఆమె చీరకు నిప్పంటుకుంది. ఆమె కేకలు వేస్తూ బయటకు పరుగులు తీసింది. ఆమెను రక్షించేందుకు శేఖర్ యత్నించగా, అతడికి గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు వీరిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఫలించక మంగళవారం ఉదయం సంగీత మృతిచెందింది. ఈ ఘటనపై కాట్పాడి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మత్తు మాత్రల విక్రయం

మణిపూర్ యువతి అరెస్ట్


ఉంగులియాచింగ్

పెరంబూర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): మత్తు మాత్రలు విక్రయిస్తున్న మణిపూర్ యువతిని ప్రత్యేక విభాగం పోలీసులు అరెస్ట్ చేశారు. మత్తు కలిగించే నొప్పి నివారణ మాత్రలు ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారంటూ ప్రత్యేక విభాగం పోలీసులకు సమాచారం అందింది. దీంతో తిరువాన్మియూర్‌లో గస్తీ చేపట్టిన పోలీసులు, ఓ పెద్ద బ్యాగుతో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఉత్తరాది మహిళను అదుపులోకి తీసుకొని విచారించారు. ఆమె 'ఇండియా మార్ట్' యాప్ ద్వారా 'టాపెంటాడోల్ హైడ్రోక్లోరైడ్' అనే మాత్రలు రూ.10కి కొనుగోలు చేసి రూ.100కు విక్రయిస్తున్నట్లు తెలిసింది. ఆమె మణిపూర్ రాష్ట్రానికి చెందిన ఉంగులియాచింగ్ అలియాస్ రెబెకా అని తెలిసింది. విచారణ అనంతరం సోమవారం ఆమెను కోర్టులో హాజరుపరచి, కోర్టు ఉత్తర్వుల మేరకు జైలు తరలించినట్లు గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

తమిళ చిత్రజ్యోతి

24న 'మిస్టర్ హౌస్‌కీపింగ్' విడుదల



'మిస్టర్ హౌస్‌కీపింగ్' మీడియా సమావేశంలో పాల్గొన్న సినీ ప్రముఖులు

తేనాండాళ్ ఫిలిమ్స్ సమర్పణలో తెరకెక్కిన చిత్రం 'మిస్టర్ హౌస్‌కీపింగ్'. అరుణ్ రవిచంద్రన్ దర్శకత్వంలో యూట్యూబ్ క్రియేటర్ హరిభాస్కర్, బిగ్ బాస్ ఫేం రియాన్, హీరోయిన్ లాస్లియా నటించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు. దీన్ని పురస్కరించుకుని చిత్ర బృందం నగరంలో తాజాగా విలేకరుల సమావేశాన్ని ఏర్పాటుచేసింది. చిత్ర నిర్మాత ఎస్.రామస్వామి అలియాస్ ఎస్.మురళి రామస్వామి మాట్లాడుతూ, 'ఈ స్టోరీపై దర్శకుడు నాతో పలుమార్లు చర్చించారు. ఫ్యామిలీ ప్రేక్షకులు ఆలరించేలా స్క్రీన్‌ప్లే సాగుతుంది. నేటి జనరేషన్ కొత్త అంశాలను ఎంజాయ్ చేసేందుకు ఇష్టపడతారు. వారికి ఒక్క అవకాశం వస్తే దూసుకుపోతారు. ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆలరించేలా ఉంటుంది' అని పేర్కొన్నారు. నటుడు రాయన్ మాట్లాడుతూ, 'ఈ అవకాశం ఇచ్చిన మురళి, నితిన్‌లకు కృతజ్ఞతలు. అవకాశాల కోసం తిరుగుతున్న సమయంలో వచ్చిన గొప్ప అవకాశం. హీరోయిన్ లాస్లియాతో కలిసి నటించడం సంతోషంగా ఉందన్నారు. దర్శకుడు అరుణ్ రవిచంద్రన్ మాట్లాడుతూ, 'నా సినీ ప్రయాణం 12వ తరగతి చదివే రోజుల్లో ప్రారంభమైంది. పదేళ్ళ తర్వాత ఇపుడు ఇక్కడ ఉన్నాను. దర్శకుడు వాసు కో డైరెక్టర్ సుకుమార్‌తో ఏర్పడిన పరిచయం కారణంగానే ఇదంతా జరిగింది. ఈ స్టోరీని నిర్మాత మురళికి చెప్పగా, ఆయనలో ఎలాంటి స్పందన కనిపించలేదు. సైలెంట్‌గా సినిమా పూర్తయింది. ఈ నెల 24వ తేదీని విడుదల చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరుతున్నాం' అని పేర్కొన్నారు.

ఆయన పేరు చెప్పి అవకాశాలు అడగడం లేదు



● అదితి శంకర్

తన తండ్రి ఎస్.శంకర్ పేరు, ఇమేజ్‌ను ఉపయోగించుకుని సినిమా అవకాశాలు అడగడం లేదని హీరోయిన్ అదితి శంకర్ స్పష్టం చేశారు. డాక్టర్ కోర్సు పూర్తి చేసిన అదితి.. సినిమాలపై ఉన్న ఆసక్తితో హీరోయిన్‌గా అరంగేట్రం చేశారు. కార్తీ హీరోగా వచ్చిన 'విరుమన్' సినిమాలో తొలిసారి నటించారు. ఆ తర్వాత 'మావీరన్', 'నేసిప్పాయ' సినిమాల్లో నటించగా ప్రస్తుతం 'వన్స్‌మోర్' అనే చిత్రంలో నటిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె తాజాగా మీడియాతో మాట్లాడుతూ, 'శంకర్ కుమార్తె కావడం గర్వంగానే ఉంది. కానీ, ఆయన పేరు చెప్పి సినిమా అవకాశాలు కోరడం ఇష్టంలేదు. అవకాశం వచ్చిన ప్రతి అడిషన్‌కు వెళ్తున్నాను. సినిమాల్లో సక్సెస్, ఫెయిల్యూర్ మన చేతుల్లో లేదు. వైద్య కోర్సు పూర్తి చేసిన వెంటనే సినిమాల్లోకి వెళతానని డాడీకి చెప్పాను. ఆయన సుదీర్ఘంగా ఆలోచన చేసి నిర్ణీత గడువులోగా సక్సెస్ కాకపోతే తిరిగి వైద్య వృత్తికి అంకితం కావాలని కండిషన్ పెట్టారు. ఆ నిబంధనకు అంగీకరించి ఇపుడు సినిమాల్లో నటిస్తున్నాను. డబ్బుకోసం సినిమాల్లో యాక్ట్ చేయడం లేదు. హిస్టరీ, పురాణకథల్లో నటించాలన్న కోరికవుంది. తెలుగులో సాయి శ్రీనివాస్‌తో ఓ చిత్రంలో నటిస్తున్నాను. తమిళంలో రజనీకాంత్, నిత్యా మేనన్, సాయి పల్లవి అంటే ఇష్టం. నా తండ్రి దర్శకత్వంలో నటించాలన్న కోరిక ఉంది. ఆయన పిలుపు కోసం ఎదురు చూస్తున్నాను' అని అదితి శంకర్ చెప్పుకొచ్చారు.

ఇంటివాడైన దర్శకుడు..


అజయ్ జ్ఞానముత్తు దంపతులతో విశాల్

● అభినందించిన విశాల్

'డిమాంటీ కాలనీ' దర్శకుడు అజయ్ జ్ఞానముత్తు ఓ ఇంటివారయ్యారు. షిమోనా రాజ్‌కుమార్ అనే యువతిని వివాహమాడారు. శాంథోమ్ చర్చిలో వీరి వివాహం ఆదివారం ఘనంగా జరిగింది. అదే రోజు రాత్రి నగర శివారు ప్రాంతమైన నెమ్మేలిలోని ఓ రిసార్టులో రిసెప్షన్ ఏర్పాటు చేయగా, ఇందులో సన్నిహితులు, బంధువులు, చిత్రపరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపి, ఆశీర్వదించారు. ఇదిలావుంటే, నడిగర్ సంఘం ప్రధాన కార్యదర్శి, హీరో విశాల్ కూడా ఆ దంపతులను అభినందించారు. నగరంలోని అజయ్ నివాసానికి వెళ్ళిన విశాల్ నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

సేయోన్ - భవానిశ్రీ జంటగా కొత్త చిత్రం


కొత్త చిత్రం పూజా దృశ్యం

'యాద్దిసై'తో పేరు తెచ్చుకున్న దర్శకుడు ధరణి రాజేంద్రన్ మరో చిత్రానికి శ్రీకారం చుట్టారు. సేయోన్ - భవానిశ్రీ జంటగా నటించే ఈ సినిమాలో దర్శక నటుడు సముద్రఖని కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ మూవీ ప్రారంభ పూజా కార్యక్రమం నగరంలో జరిగింది. జేకే ఫిల్మ్ ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మాత జె.కమలకన్నన్ నిర్మిస్తున్నారు. ఈ పూజా కార్యక్రమంలో శక్తి ఫిలిమ్స్ అధినేత పి.శక్తివేలన్, నిర్మాత డి.ధనుంజయన్, నటుడు చిత్రాలక్ష్మణన్, దర్శకుడు మణిత్రా పి.మూర్తి, 'అయలి' వెబ్‌సిరీస్ ఫేం ముత్తుం, నిర్మాత గణేష్ కామన్‌మేన్, యూట్యూబర్ మదన్ గౌరి, మిస్టర్ జీకే తదితరులు పాల్గొని చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. నిర్మాత జె.కమలకన్నన్ తమ తొలి ప్రాజెక్టు వివరాలను వెల్లడిస్తూ, 'చిన్నతనం నుంచే నాకు సినిమాపై అమితాసక్తి ఉంది. 'యాద్దిసై' మూవీతో ప్రతి ఒక్కరి దృష్టిని ఆకర్షించిన దర్శకుడు ధరణితో కలిసి తమ తొలి ప్రాజెక్టును ప్రారంభించడం సంతోషంగా ఉంది. చిత్రపరిశ్రమలో ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించడమే తమ బ్యానర్ ఏకైక లక్ష్యం. ఫిబ్రవరిలో చిత్రీకరణ పనులు ప్రారంభించనున్నాం. పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం' అని పేర్కొన్నారు. కాగా, ఈ సినిమాకు సంగీతం చక్రవర్తి.

తిరుచెందూరులో బాలాలయ పూజలు


మూలవిరాట్టు షణ్ముఖనాథుడి విమానం వద్ద బాలాలయం పూజలు నిర్వహిస్తున్న శైవపండితులు

టి.నగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూరు సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మూలవిరాట్టు షణ్ముఖర్ సహా 17 విమానాలకు బాలాలయ పూజలు నిర్వహించారు. ఈఆలయంలో హెచ్‌సీఎల్ సంస్థ రూ.200కోట్లు, హిందూ దేవాదాయ శాఖ రూ.100 కోట్లు సహా మొత్తం రూ.300 కోట్ల సాయంతో భారీ నిర్మాణాలు చేపడుతున్నారు. జూలై 7న మహాకుంభాభిషేకం నిర్వహించాలని దేవాదాయ శాఖ నిర్ణయించింది. దీని కోసం గత ఏప్రిల్ 26న రాజగోపురానికి బాలాలయం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆలయంలోని మూలవర్లు షణ్ముఖనాథుడు, వళ్లి, దైవానై, పెరుమాల్, వల్లభ వినాయకుడు. నటరాజస్వామి, భైరవర్ సన్నిధులపైని 17 విమానాలకు బాలాలయం పూజలు జరిపారు. ఈ సందర్భంగా వేకువజామున 3.30 గంటలకు విశ్వరూప దీపారాధన, 4 గంటలకు ఉదయమార్తాండ అభిషేకం, దీపారాధన నిర్వహించారు. విమాన బింబ కటాహర్షణం, హోమపూజ నిర్వహించారు. అత్తి కలపతో తయారైన చిత్రబింబానికి కలశాభిషేకం కూడా చేశారు.. తిరువనంతపురం ముట్టవిల్లా మఠానికి చెందిన బ్రహ్మశ్రీ సుబ్రమణ్యరు తంత్రి పర్యవేక్షణలో మూలవర్ల విమానానికి ఆవాహనం జరిపారు. ఆవాహనం చేసిన కుంభ జలాన్ని మహా మండపానికి మంగళవాయిద్యాలు, మంత్రోచ్చారణ నడుమ ఊరేగించి మూలవిరాట్టు పాదాలపై ఆ జలాలను పోశారు. మూలవిరాట్టు వళ్లి, దైవానై, షణ్ముఖుడు, నటరాజస్వామికి శివాచార్యులు, పెరుమాళ్‌కు భట్టాచార్యులు, వల్లభవినాయకుడికి విద్యాకర్త శివసామి దీక్షితార్ పర్యవేక్షణలో పూజలు నిర్వహించారు. ఈ పూజాది కార్యక్రమాలలో హిందూదేవాదాయ శాఖ ప్రాంతీయ డిప్యూటీ కమిషనర్ అన్బుమణి, ఆలయ డిప్యూటీ కమిషనర్ జ్ఞానశేఖరన్, జాయింట్ కమిషనర్ సెల్వి, అసిస్టెంట్ కమిషనర్ నాగవేల్, సూపరింటెండెంట్ అరుళ్‌మణి, హెచ్‌సీఎల్ సంస్థ ఉపాధ్యక్షులు శ్రీమది శివశంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ శివ ఆనంది తదితరులు పాల్గొన్నారు.



అవార్డు ప్రదానం చేస్తున్న మంత్రి పళనివేల్ త్యాగరాజన్

ఆర్‌ఎంకే 'నవీన తమిళర్'కు 'కిన్నోవేట్-2025' అవార్డు

అడయార్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖ విద్యా సంస్థ ఆర్‌ఎంకే ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన 'నవీన తమిళర్' 'కిన్నోవేట్ 2025' అవార్డు సొంతం చేసుకుంది. నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార, సాంకేతిక శాఖామంత్రి డాక్టర్ పళనివేల్ త్యాగరాజన్ అవార్డు ప్రదానం చేశారు. రాష్ట్ర ఐటీ, డిజిటల్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్, ఐసీటీ అకాడెమీతో కలిసి ప్రముఖ స్వచ్ఛంద సంస్థ నో యువర్ నైబర్‌హుడ్ 'కిన్నోవేట్ 2025' నిర్వహించింది. 'కిన్నోవేట్-2025' అనేది హై ఇంపాక్ట్ హ్యాకథాన్, ఆవిష్కరణ, సహకారం, సృజనాత్మక వంటి అంశాల్లో విద్యార్థులను ప్రోత్సహించేలా రూపొందించారు. ఈ కిన్నోవేట్‌లో నగరంలోని 50కి పైగా ఇంజనీరింగ్, ఆర్ట్స్ కాలేజీల నుంచి 1100 మందికి పైగా విద్యార్థులు పాల్గొని వివిధ అంశాలపై తమ స్పందన తెలియజేశారు. ఇందులో ఆర్‌ఎంకే ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన నవీన తమిళర్ విజేతగా నిలిచింది. ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో కేఎస్‌వై సీఈవో గాయత్రీ త్యాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు


మహిళలకు సంక్షేమ సహాయాలు అందజేస్తున్న సినీ నటి గౌతమి, ఆర్ఎస్ రాజేష్ తదితరులు

● నటి గౌతమి

ప్యారీస్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదని, ఎటుచూసినా లైంగికవేధింపులు, హత్యాయత్నాలకు గురవుతున్నారని ప్రముఖ సినీ నటి, అన్నాడీఎంకే ప్రచారకర్త గౌతమి వ్యాఖ్యానించారు. ఉత్తర చెన్నై ఉత్తరం, తూర్పు జిల్లా అన్నాడీఎంకే, కార్యదర్శి ఆర్ఎస్ రాజేష్ అధ్యక్షతన దివంగత మాజీముఖ్యమంత్రి ఎంజీఆర్ 108వ జయంతిని పురస్కరించుకుని సోమవారం రాత్రి కొరుక్కుపేటలో బహిరంగ సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నటి గౌతమి 2వేల మంది పేదలకు సంక్షేమ సహాయాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పెంచిన విద్యుత్ ఛార్జీలు, ఇంటి పన్ను, ఆస్తి పన్నులను తగ్గించాలని డిమాండ్ చేశారు.

తిరువళ్లువర్ వర్సిటీలో సైన్స్ ఎగ్జిబిషన్


ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి సేర్కాడులో ఉన్న తిరువళ్లువర్ వర్సిటీలో సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ సుబ్బులక్ష్మి జ్యోతి వెలిగించి ఎగ్జిబిషన్ ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్ట్‌లున్నాయి. కార్యక్రమంలో వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆర్ముగం, వర్సిటీ అధ్యక్షులు దినకరన్ (రసాయన శాస్త్రం), యువరాజ్ (భౌతిక శాస్త్రం) తదితరులు పాల్గొన్నారు.

జాగ్వార్ కార్ల పరిశ్రమకు పర్యావరణ అనుమతులు

పెరంబూర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాణిపేట జిల్లా పనబాక్కం సిప్కాట్‌లో ఏర్పాటుకానున్న జాగ్వార్ లాండ్ రోవర్ కార్ల కర్మాగారానికి తమిళనాడు ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ కమిషన్ పర్యావరణ అనుమతులు మంజూరు చేసింది.. టాటా గ్రూప్ సంస్థ ఈ కర్మాగారం ఏర్పాటుచేయనుంది. టాటా కార్ల ఉత్పత్తి కర్మాగారానికి సెప్టెంబరు 28న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ భూమి పూజ చేశారు. పనబాక్కం సిప్కాట్‌లో టాటా మోటార్స్ సంస్థ రూ.9,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. అందులో తొలివిడతగా రాణిపేటలో రూ.914 కోట్లతో కర్మాగారం ఏర్పాటుకానుంది. కొత్త కర్మాగారం 2.5 లక్షల యూనిట్ల తయారీ సామర్థ్యం కలిగి ఉందని, తదుపరి 5 నుంచి 7 ఏళ్లలో ఉత్పత్తి సామర్థ్యం పెంచేలా చర్యలు చేపట్టనున్నట్లు సంస్థ ప్రకటించింది.

డ్రోన్ కెమెరాలతో క్వారీలో తనిఖీలు


తిరుమయం ప్రాంతంలోని రాళ్లక్వారీలో డ్రోన్ కెమెరా ద్వారా పరిశీలిస్తున్న అధికారులు

ప్యారీస్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా తిరుమయం ప్రాంతంలో చట్టవిరుద్ధంగా నిర్వహిస్తున్న క్వారీలను మంగళవారం డ్రోన్ కెమెరా ద్వారా అధికారులు పరిశీలించారు. తిరుమయం సమీపంలో ఉన్న వెంగలూర్ గ్రామానికి చెందిన అన్నాడీఎంకే మాజీ కౌన్సిలర్ జెగ్బర్ అలీ ప్రభుత్వం అనుమతి లేకుండా తిరుమయం ప్రాంతంలో నిర్వహిస్తున్న క్వారీలకు వ్యతిరేకంగా న్యాయస్థానంలో పిటిషన్ వేయడంతో పాటు, జిల్లా కలెక్టర్, రెవెన్యూ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఈ నెల 17వ తేదీ మసీదుకు వెళ్లి ప్రార్థనలో పాల్గొని ఇంటికెళ్తున్న మార్గంలో లారీ ఢీకొనడంతో మృతిచెందాడు. ఈ ఘటనపై అనుమానించిన జెగ్బర్ అలీ భార్య మరియం ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన తిరుమయం పోలీసులు విచారణ జరిపగా, హత్యకు సంబంధించిన వాస్తవాలు వెలుగు చూశాయి. దీంతో లారీతో గుద్ది జెగ్బర్ అలీని హతమార్చిన వ్యవహారంలో క్వారీ నిర్వాహకులు రాజు, రామయ్య సహా లారీ డ్రైవర్లను అరెస్టు చేసి జైలుకు తరలించారు. రాష్ట్రంలో కలకలం రేగెత్తించిన ఈ వ్యవహారంపై స్పందించిన రాష్ట్రప్రభుత్వం పుదుకోట జిల్లాలోని పలుప్రాంతాల్లో చట్టవిరుద్ధంగా నిర్వహిస్తున్న క్వారీల వివరాలను సేకరించి నివేదిక సమర్పించాలని రెవెన్యూ, పోలీసు శాఖలకు ఆదేశించింది. ఈ మేరకు తొలి విడతగా తిరుమయం ప్రాంతంలో ఉన్న రాళ్లక్వారీలను అధికారుల బృందం డ్రోన్ కెమెరా ద్వారా పరిశీలించే పనులను మంగళవారం ప్రారంభించారు.

సవితాలో యూరోగైనకాలజీ విభాగం

ప్యారీస్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సవితా వైద్యశాలలో ఏర్పాటు చేసిన యూరోగైనకాలజీ ప్రత్యేక విభాగాన్ని ప్రముఖ నటి పూర్ణిమ భాగ్యరాజ్ సోమవారం ప్రారంభించారు. ఈ విభాగం ద్వారా పెల్విక్‌ఫ్లోర్ డిజార్డర్ సమస్యలున్న మహిళలకు శస్త్ర చికిత్స అందించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ వీరయ్యాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్రాస్ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ రాజమహేశ్వరి, డాక్టర్ దీపక్ నల్లస్వామి, డీన్ డాక్టర్ జె.కుముద, యూరోగైనకాలజీ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ కె.సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక వైద్య విభాగాన్ని ప్రారంభిస్తున్న నటి పూర్ణిమ భాగ్యరాజ్

75 యేళ్లుగా చెక్కుచెదరని రహదారి

● ఇది కారైక్కుడి చెట్టినాడు అద్భుతం ● కంటికి రెప్పలా కాపాడుకుంటున్న వైనం


కారైక్కుడిలో ఇడయర్ తెరు- రైల్వేస్టేషన్ రహదారి

టి.నగర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డేస్తే వారంలో గుంతలమయ్యే నేటి పరిస్థితులలో శివగంగ జిల్లా కారైక్కుడి వద్ద 75 యేళ్లకు ముందు తారు వాడకుండా వేసిన రహదారి చెక్కుచెదరకుండా ఉండడం చూసి ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు ఆశ్చర్యపోతున్నారు. కారైక్కుడి అంటేనే చెట్టినాడు సంప్రదాయ ఇళ్ళకు పెట్టింది పేరు. కారైక్కుడి చెట్టినాడు బాణీ నివాసగృహాలు ఎప్పుడు చల్లదనంతో ఉంటాయి. విశాలమైన లోగిళ్లు, గాలి, వెలుతురు ఉండే ఈ భవనాలు శతాబ్దాలు గడిచినా చెక్కుచెదరకుండా ఉంటాయి. ఆ చెట్టినాడు పద్ధతిలోనే ఇడయర్ తెరు నాలుగురోడ్ల కూడలి నుండి కారైక్కుడి రైల్వేస్టేషన్ వరకు ఉన్న 3 కిలోమీటర్ల రహదారిని స్థానిక ప్రజలు కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. 1949లో చెట్టినాడు సంప్రదాయిక పద్ధతిలో కుంకుడు కాయలు, కరుప్పట్టి (నల్లబెల్లం), సున్నపు మిశ్రమంతో ఈ రహదారి నిర్మించారు. ఈ రోడ్డు కింద అధికారులు భూగర్భడ్రైనేజీని తవ్వేందుకు ప్రయత్నించినప్పుడు స్థానిక ప్రజలంతా ససేమిరా కుదరదన్నారు. రోడ్డుపై చిన్న గుంత తవ్వినా ఊరుకునేది లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు ఆ రహదారి జోలికి వెళ్లకుండా రహదారిపక్కనున్న భాగంలో డ్రైనేజీ తవ్వకాలు చేపట్టారు. ఆ తర్వాత ఈ రహదారి తొలగించి తారు రోడ్డు వేయాలని కార్పొరేషన్ అధికారులు భావించారు. ఈ ప్రతిపాదన కూడా స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ విషయమై కారైక్కుడి తమిళ మక్కల్ మండ్రం నాయకుడు ఎస్ఎం రాజకుమార్ మాట్లాడుతూ 75 యేళ్లనాటి ఈ రహదారిలో రోజూ 50కి పైగా సరకుల లారీలు రైల్వేస్టేషన్‌కు వచ్చి వెళ్తుంటాయని, లోడు లారీలు ఎన్ని వెళ్ళినా ఈ రహదారి చెక్కుచెదరకుండా ఉందన్నారు. రహదారికి ఇరువైపులా కంకర కోసం పగులగొట్టే చిన్న చిన్న రాళ్ళను పేర్చి ఉన్నారని, మరో 500 యేళ్ల దాకా ఈ రహదారి దెబ్బతినే ప్రసక్తే లేదని చెప్పారు. ఈ రహదారిని ఇంజనీరింగ్ నిపుణులు, కాంట్రాక్టర్లు పరిశీలించి నాణ్యమైన రోడ్లు ఎలా వేయాలో నేర్చుకుంటే మంచిదని హితవు పలికారు. ఈ రహదారిపై తారురోడ్డును నిర్మించకూడదని, రహదారిని వారసత్వ పర్యాటక రహదారిగా ప్రకటించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సముద్ర సరిహద్దులు దాటి వెళ్లొద్దు

● రాష్ట్ర జాలర్లకు ప్రభుత్వం హెచ్చరిక

ప్యారీస్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జాలర్లు ఈ నెల 24, 27 తేదీల్లో సముద్ర సరిహద్దులు దాటి చేపల వేటకు వెళ్లరాదని రాష్ట్ర మత్స్యశాఖ హెచ్చరికలు జారీచేసింది. ఈ మేరకు మంగళవారం ఆ శాఖ విడుదల చేసిన ప్రకటనలో, శ్రీలంక నావికా దళం 24, 27 తేదీల్లో గాంగేశన్‌తురై, పరిత్తితురై సముద్రతీర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు రైఫిల్ శిక్షణలో పాల్గొంటారని, ఈ రెండు రోజులు తమిళ జాలర్లు పాక్ జలసంధి ప్రాంతానికి చేపల వేటకు వెళ్లరాదని సూచించింది.

ఘనంగా ఎంజీఆర్ జయంతి వేడుకలు


ప్రజలకు సహాయాలు అందజేస్తున్న అన్నాడీఎంకే నేతలు

తిరుత్తణి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): దివంగత నేత తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ 108వ జయంతిని పురస్కరించుకుని తిరుత్తణి నియోజకవర్గం పల్లిపట్టు బజారులో ప్రజలకు సహాయాల పంపిణీ చేశారు. పల్లిపట్టు అన్నాడీఎంకే కార్యదర్శి జయవేలు ఆధ్వర్యంలో సుమారు 300 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి పీవీ రమణ, మాజీ ఎంపీ హరి, జిల్లా యూనియన్ కార్యదర్శులు టీడీ శ్రీనివాసన్, ఈఎన్ కండిగై రవికుమార్, తిరుత్తణి నగర కార్యదర్శి సౌందరరాజన్, కోశాధికారి జె.పాండురంగన్, జిల్లా ఉప కార్యదర్శి శాంతిప్రియ సురేష్, కమిటీ సభ్యుడు ఎలంగోవన్, ఏజీ రవిచంద్రన్, లోకేష్, కమల్, ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో జ్యోతిర్లింగ ప్రదర్శన


సోమనాథ్ ఆలయ నమూనా వద్ద నిర్వాహకులు

తిరుత్తణి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు నగరి రోడ్డులో ఉన్న ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ సేవా కేంద్రం ఆధ్వర్యంలో జ్యోతిర్లింగ క్షేత్రాల ప్రదర్శన, ఉత్సావాలు నిర్వహించారు. ఈ ప్రదర్శనకు చుట్టుప్రక్కల ప్రాంతాల ప్రజలు వచ్చి దర్శించారు. ఈ కార్యక్రమానికి బి.కె. బెనర్జీ, రాధా రమణి, సోమనాథం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఈరోడ్ ఈస్ట్‌లో అర్ధరాత్రి ఉద్రిక్తత

● మహిళా అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ


బెంగళూరుకు చెందిన అభ్యర్థి నామినేషన్ తోసిపుచ్చాలని ఆందోళన చేస్తున్న పద్మరాజన్ సహా ఇండిపెండెంట్లు. ఇన్‌సెట్‌లో అభ్యర్థి పద్మావతి

చెన్నై, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికలలో నామినేషన్ల పరిశీలన ముగిసి చిహ్నాలు కేటాయించే సమయంలో కర్ణాటకకు చెందిన పద్మావతి దాఖలు చేసిన నామినేషన్‌ను తిరస్కరించాలని ముగ్గురు ఇండిపెండెంట్లు పట్టుబట్టారు. పద్మావతి నామినేషన్ తిరస్కరించాలని కోరుతూ ఇండిపెండెంట్లు నూర్ మహమ్మద్, అగ్ని ఆళ్వార్, పద్మరాజన్ ధర్నా జరిపారు. దీంతో సోమవారం రాత్రి ఈరోడ్ కార్పొరేషన్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణాధికారి కార్యాలయంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పద్మావతి కర్ణాటక రాష్ట్రం బెంగళూరు ఉదయనగర్ ప్రాంతానికి చెందినవారని, ఆమెకు కృష్ణరాజపురం నియోజకవర్గంలోనే ఓటు హక్కు ఉందని, ఎన్నికల నిబంధన మేరకు ఆమె నామినేషన్ తిరస్కరించాలని ముగ్గురు ఇండిపెండెంట్లు డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులు ఆయా రాష్ట్రాలకు చెందినవారే పోటీ చేయాలన్న నిబంధన ఉందన్నారు. దీనితో సోమవారం అర్ధరాత్రి అధికారులు పద్మావతి నామినేషన్‌ను తోసిపుచ్చారు. దీనితో అభ్యర్థుల సంఖ్య 47 నుండి 46కు తగ్గింది.

ఎస్వీయూలో చిరుత!

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలోని హెచ్-బ్లాక్ హాస్టల్ సమీపంలో మంగళవారం రాత్రి చిరుత సంచరించినట్లు తెలిసింది. దీంతో భయాందోళన నెలకొంది. ఇప్పటికే విద్యార్థులు, ఉద్యోగులను అధికారులు అప్రమత్తం చేశారు. చిరుత సంచారం నేపథ్యంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. రాత్రి 7 నుంచీ ఉదయం 7 గంటల మధ్య విద్యార్థులు, ఉద్యోగులు సంచరించకూడదని సూచించారు. వర్సిటీలో ఎక్కువగా ఉన్న కుక్కల కోసం చిరుత వస్తున్నట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు. అందుకని కుక్కలు పట్టించేలా వర్సిటీ అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

డాడీతో సినిమాకి టైం ఉంది

● హీరో ఆకాష్ పూరి



తిరుమల, జనవరి21(ఆంధ్రజ్యోతి): తన తండ్రి పూరి జగన్నాథ్‌తో సినిమా చేయడానికి ఇంకా టైం ఉందని హీరో ఆకాష్ పూరి తెలిపారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడుతూ, చాలా రోజుల తర్వాత అద్భుతమైన శ్రీవారి దర్శనం లభించిందన్నారు. త్వరలో 'తల్వార్' సినిమా చేయబోతున్నట్టు తెలిపారు. ఈ సినిమా షూటింగ్ జనవరి నెలాఖరులో ప్రారంభమవుతుందన్నారు. అందుకే స్వామి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చానన్నారు. ఇక, తన తండ్రి దర్శకుడు పూరి జగన్నాథ్ ఓ కథ రాస్తున్నారని, ఎవరు హీరో అనేది ఇంకా ఫిక్స్ కాలేదని ఓ ప్రశ్నకు బదులిచ్చారు.


శ్రీవారి సేవలో గాయని మంగ్లీ

తిరుమల, జనవరి21 (ఆంధ్రజ్యోతి):గాయని మంగ్లీ మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలిసి ఆమె మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు.



విజయశ్రీ, మంగ్లీ

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం నాటి హుండీ ఆదాయం : రూ.3.59 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 83,806

తలనీలాలు సమర్పించినవారు: 23,352

ప్రచారం లేకున్నా... పక్షుల పండుగ సూపర్ హిట్!

అన్నీ తానై వ్యవహరించిన జిల్లా కలెక్టర్

స్థానిక ఎమ్మెల్యేతో సమన్వయం





తడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సమయం లేదు... ప్రచారం అంతకన్నా లేదు... మధ్యలో కొన్ని ఆటంకాలు... అయినా ఇంతపెద్ద పండుగను విజయవంతం చేయగలిగారు అధికారులు. ఉమ్మడి నెల్లూరుజిల్లాలో 2001లో ప్రారంభమైన పక్షుల పండుగను 2020 దాక నిర్వహించారు. జగన్ ప్రభుత్వం ఒక ఏడాది మొక్కుబడిగా నిర్వహించి నాలుగేళ్ల చేతులెత్తేసింది. టీడీపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే మళ్లీ పక్షుల పండుగను ఘనంగా నిర్వహించాలనే నిర్ణయం తీసుకుంది. తిరుపతి జిల్లా ఏర్పడ్డాక తొలిసారి ఈ పండుగ నిర్వహణకు అధికార యంత్రాంగం సిద్ధపడింది. ఏర్పాట్లు మొదలయ్యే సమయంలో వైకుంఠ ఏకాదశి టోకెన్ల క్యూలో తొక్కిసలాట సంఘటన కుదిపేసింది. జిల్లా అధికారులంతా దానిమీద దృష్టి పెట్టాల్సివచ్చింది. ఈలోగా సంక్రాంతి పండుగ దినాలు వచ్చేశాయి. పాఠశాలలకు సెలవులు కావడంతో విద్యార్థులు పండుగకు రారనే అనుమానం ఏర్పడింది. పక్షుల పండుగ తేదీలను అప్పటికే మార్చినందున మరోసారి మార్చేందుకు సిద్ధపడలేదు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం ఉన్న అతి కొద్దిరోజులలోనే రాత్రి, పగలు తేడా లేకుండా పక్షుల పండుగ ఏర్పాట్లను పూర్తిచేయడం విశేషం. ఈ హడావుడిలో ప్రచారం కూడా పెద్దగా చేయలేకపోయారు. తొలిరోజు సమావేశానికి మంత్రి కందుల దుర్గేష్ హాజరయ్యారు. సమావేశం జనం లేక వెలవెలబోయింది.రాజకీయ ప్రత్యర్థులు అధికార కూటమిపై విఫలం అంటూ విమర్శల దాడి మొదలు పెట్టారు. వీరికి తోడు వాన కూడా కురిసి ప్రధాన ప్రాంగణం బురదమయం అయ్యింది.



అటకానితిప్ప వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ (ఫైల్ ఫొటో)

అయినా అధికార యంత్రాంగం వెనకడుగు వేయలేదు. ఆగమేఘాలపై మైదానం సిద్ధం చేశారు. ఆకట్టుకునేలా స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. దీంతో శనివారం మధ్యాహ్నం నుంచి తండోపతండాలుగా జనం రావడం మొదలుపెట్టారు. రెండవరోజు ఆదివారం కావడంతో కుటుంబాలతో సందర్శకులు పోటెత్తారు. నేలపట్టు, అటకానితిప్ప, సూళ్లూరుపేట, భీములవారిపాళెం పడవలరేవు ఉదయం నుంచే జనంతో కిటకిటలాడిపోయాయి. సాయంత్రానికి ఆ రద్దీ మూడింతలైంది. భద్రత దృష్ట్యా పడవకి పదిమందినే అనుమతించడం, అందరికీ లైఫ్ జాకెట్లు ఉండేలా శ్రద్ధ తీసుకోవడం, తాత్కాలిక ప్లాట్ ఫారాలు ఏర్పాటు చేసి నేరుగా పడవలోకి ఎక్కేలా చూడడం వంటి చర్యల వల్ల చిన్న సంఘటన కూడా జరగలేదు.

సాంస్కృతిక కార్యక్రమాలు హైలెట్

సాంస్కృతిక కార్యక్రమాలు ఈ ఏడాది విశేషంగా ఆకట్టుకున్నాయి. సినీ కళాకారులు రావడంతో జనం పెద్ద సంఖ్యలో మూడు రోజులూ వచ్చారు. సూళ్లూరుపేట కళాశాల మైదానంతోపాటు దాని చుట్టుపక్కల రోడ్లు అన్ని కిటకిటలాడాయి. మూడవరోజున సోమవారం అర్ధరాత్రి వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగినా జనం కదలకుండా తిలకించసాగారు.

పోలీసుల సేవలు భేష్

తిరుపతి దుర్ఘటన నేపథ్యంలో పోలీసులు తగిన ఏర్పాట్లు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలకు జనం పోటెత్తి వచ్చినా చిన్న సంఘటన కూడా జరగకుండా నియంత్రించారు. కళాశాల మెయిన్ గేట్ వద్ద ఆదివారం కొంత తోపులాట జరగడంతో అప్రమత్తమై నిమిషాలలోనే పరిస్థితి అదుపులోకి తీసుకువచ్చారు.

కలెక్టర్.. ఎమ్మెల్యే ఎనలేని కృషి

పండుగ విజయానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీలు సమన్వయంతో కృషి చేశారు. ఎక్కడ సమస్య తలెత్తినా అప్పటికప్పుడు పరిష్కారదిశగా చర్యలు తీసుకున్నారు.

ఇవీ లోపాలు..

- ఇంత భారీ ఎత్తున జరిగిన కార్యక్రమాలకు అనేక ప్రాంతాల నుంచి జనం వస్తారని అంచనా ఉన్నా తగినన్ని బస్సులను ఏర్పాటు చేయలేకపోయారు.
- నేలపట్టులో, అటకానితిప్పలో వేదికలు ఏర్పాటు చేసినా ఆకట్టుకునే కార్యక్రమాలను నిర్వహించలేకపోయారు.
- బీవీపాలెం పడవల రేవులో పడవకు పది మందిని మాత్రమే అనుమతించడంతో జనం గంటలకు గంటలు ఎదురు చూడాల్సి వచ్చింది. ఇంకా ఎక్కువ పడవలను ఏర్పాటు చేసి ఉండాల్సింది.
- వివిధ ప్రాంతాల్లో ముందస్తు ప్రచారం జరగలేదు. కేవలం ఒక పత్రికలో చిన్న ప్రకటనతో సరిపెట్టుకున్నారు. సోషల్ మీడియాను కూడా తగినంతగా వినియోగించుకోలేదు.

నలుగురు స్మార్ట్ ఫోన్ దొంగల అరెస్టు

● 50 సెల్‌ఫోన్ల స్వాధీనం

● నిందితుల్లో బాలుడు ● బోస్టన్ స్కూల్‌కు తరలింపు



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

శ్రీకాళహస్తి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌ఫోన్లను టార్గెట్‌గా చేసుకుని చోరీ చేసే బాలుడి సహా మరో ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి తెలిపిన ప్రకారం.. కర్నూలు జిల్లా డోన్ పట్టణం శివరాంపేటకు చెందిన వెంకటసాయి(22) హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో ఉంటూ కూలీ పనులు చేసుకునేవాడు. డోన్‌లోని శ్రీరామ్‌నగర్ ప్రాంతానికి చెందిన మురళి(37) కూడా హైదరాబాద్‌లో కీసరలో కూలీ పనులు చేస్తుంటాడు. అనంతపురం జిల్లా బుక్కరాయ సముద్రం మండలం ఎల్‌బీ కాలనీకి చెందిన సాయిశివ(29) ప్రైవేటు పనులు చేస్తుండేవాడు. ఈ ముగ్గురు కలిసి ఈజీమనీ కోసం స్మార్ట్‌ఫోన్లను చోరీ చేస్తుండేవారు. వీరికి హైదరాబాద్ నగరం ఎల్‌బీనగర్‌కు చెందిన 12 ఏళ్ల బాలుడు తోడయ్యాడు. ఈక్రమంలో శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో పట్టణ శివార్లలోని నంది కూడలి వద్ద మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. పోలీసులను గమనించిన ఓ కారు వేగంగా వెళ్లిపోతుండగా అడ్డుకున్నారు. కారులోని వారిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసుల విచారణలో అంతర్రాష్ట్ర స్మార్ట్‌ఫోన్ దొంగలుగా తేలింది. వారి నుంచి 50 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బాలుడిని బోస్టన్ స్కూల్‌కు తరలించారు. అనంతరం డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి ముగ్గురు యువకుల అరెస్టు చూపారు. నిందితులను రిమాండుకు తరలించారు.

ఒకప్పుడు మన జిల్లా ఉద్యమాల ఖిల్లా!

భూస్వాముల హత్యలు.. నక్సల్స్ ఎన్‌కౌంటర్లతో అట్టుడికిన చరిత్ర

చలపతి ఎన్‌కౌంటర్‌తో జిల్లాలో ముగిసిన మావోయిస్టు అధ్యాయం



తిరుపతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దుల్లో మంగళవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి అలియాస్ చలపతి మృతి చెందడంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నక్సల్స్ పరంగా ఓ అధ్యాయం ముగిసినట్టయింది. జిల్లా నుంచీ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో సభ్యుడుగా ఎదిగిన ఏకైక నక్సల్‌గా ఆయన గుర్తింపు పొందారు. నక్సల్ ఉద్యమంలో జిల్లాకు సంబంధించినంతవరకూ ఆయన చివరి వ్యక్తి. జిల్లా వామపక్ష తీవ్రవాద చరిత్రలో రామచంద్రారెడ్డి అలియాస్ చలపతి మరణంతో ఓ అధ్యాయం ముగిసినట్టయింది. 1970ల నుంచీ 2003 వరకూ సుమారు మూడు దశాబ్దాల పాటు జిల్లాలో రాడికల్, రైతు కూలీ సంఘం, నక్సల్ తదితర పేర్లతో మావోయిస్టు ఉద్యమం ఉధృతంగా సాగింది. ప్రస్తుత తరానికి పెద్దగా తెలియని ఆ ఉద్యమ కాలాన్ని అప్పటివారు చలపతి ఎన్‌కౌంటర్‌తో ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారు.

ఎస్వీయూలో పురుడు పోసుకున్న రాడికల్స్

ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించినంతవరకూ 1970వ దశకంలో రాడికల్ విద్యార్థి సంఘం పేరిట తీవ్రవాద వామపక్ష భావజాలమున్న ఉద్యమం మొదలైంది. తిరుపతిలోని ఎస్వీయూ నుంచీ ప్రారంభమైన ఈ విద్యార్థి సంఘం శాఖలు వేగంగా జిల్లా అంతటా వ్యాపించాయి. ముఖ్యంగా పడమటి ప్రాంతమైన మదనపల్లె, వాయల్పాడు, పీలేరు, తంబళ్లపల్లె, పుంగనూరు తదితర ప్రాంతాల్లో ఆర్ఎస్‌యూ బలంగా వేళ్లూనుకుంది. సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు ఎక్కువగా ఈ సంఘం వైపు ఆకర్షితులయ్యారు. అలాగే సోమల, చౌడేపల్లె, కలికిరి ప్రాంతాల్లో మెజారిటీ దళిత వాడల యువకులు యూనియన్‌లో చేరి చురుగ్గా పనిచేశారు. ఓ దశలో మదనపల్లెలోని ప్రభుత్వ మోడల్ పాలిటెక్నిక్ ఆర్ఎస్‌యూకు కేంద్ర స్థానంగా మారింది. తరచూ రాడికల్ విద్యార్థులు, ఏబీవీపీ విద్యార్థుల నడుమ ఘర్షణలు తలెత్తేవి. ఆ నేపథ్యంలో ఇరువైపులా హత్యలు, ప్రతీకార హత్యలు కూడా జరిగాయి. కాగా రాడికల్ యూత్ లీగ్ పేరిట యువజన విభాగం కూడా చాలా చురుగ్గా పనిచేసింది. ఈ సంఘాల్లో జిల్లా నుంచీ పలువురు కీలక నేతలుగా ఎదిగారు. సూరిశెట్టి సుధాకర్ ఆర్ఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేసి అటు తర్వాత రాష్ట్ర కార్యదర్శిగా రెండు సార్లు వ్యవహరించారు. పోలీసులకు పట్టుబడి విడుదలయ్యాక 1980లలో ఉద్యమం నుంచీ వెలుపలికి వచ్చేశారు. తిరుపతి ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి చంద్రశేఖర్ జిల్లా అధ్యక్షుడుగా పనిచేశారు. మల్లిక్ అనే నేత సైతం తిరుపతిలో కీలకంగా పనిచేశారు. ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థి ప్రభాకర్ 1990లలో ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు.

దళాలతో పీపుల్స్‌వార్

మావోయిస్టు పార్టీలో చీలక సంభవించి కొండపల్లి సీతారామయ్య వర్గం నుంచి వేరుపడి పీపుల్స్ వార్ గ్రూప్ ఏర్పాటు అయ్యింది. 1980,90 దశకాల్లో పీపుల్స్‌వార్ గ్రూపు కార్యకలాపాలు జిల్లాలో ఉధృతంగా సాగాయి. పాపాఘ్ని దళం, తలకోన దళం, కాళంగి దళం వంటి పేర్లతో నక్సల్స్ జోరుగా కార్యకలాపాలు నడిపారు.

- వాయల్పాడు పంచాయతీ సమితి మాజీ అధ్యక్షుడు చాకిరేవుపల్లి మల్‌రెడ్డిని కలికిరి క్రాస్ రోడ్డులో నక్సలైట్లు బాంబులు వేసి కొడవళ్లతో దాడి చేసి చంపారు.
- వాయల్పాడు మండలం గొల్లపల్లిలో మజ్జిగ వెంకటేశు అనే మోతుబరి రైతుకు కాళ్ళు నరికేశారు.
- పెద్ద పంజాణి పోలీసు స్టేషన్‌పై నక్సలైట్లు దాడి చేసి తుపాకులు ఎత్తుకుని పరారైన ఘటన జిల్లాను కుదిపేసింది.
- వాయల్పాడు మండలం చింతపర్తి రైల్వే స్టేషన్‌ను డిటొనేటర్లు పెట్టి పేల్చేశారు.
- కలకడ మండలం కదిరాయచెరువులో టెలిఫోన్ ఎక్స్ఛేంజీని సైతం పేల్చేశారు.
- కంభంవారిపల్లి, ఎర్రావారిపాలెం మండలాల్లో ఎంతోమంది భూస్వాములు, మోతుబరి రైతుల ఇళ్ళు, ఆస్తులు పేల్చేశారు. ఎంతోమందిపై దాడులు చేశారు.

పశ్చిమాన సంచలనం రైతు కూలీ ఉద్యమం

పీలేరు, మదనపల్లె, తంబళ్ళపల్లె, వాయల్పాడు, పుంగనూరు ప్రాంతాల్లో తలెత్తిన రైతు కూలీ సంఘం భూస్వాములను బెంబేలెత్తించింది. పలువురు భూస్వాములను రైతు కూలీ సంఘ ఉద్యమకారులు హతమార్చారు. ప్రతీకార దాడుల్లో పలువురు ఉద్యమకారులూ ప్రాణాలు పోగొట్టుకున్నారు.

- 1983 సెప్టెంబరులో మదనపల్లె సొసైటీ కాలనీలో తంబళ్లపల్లెకి చెందిన పోస్టాఫీసు రెడ్డెప్పరెడ్డిని ఉద్యమకారులు హత్య చేశారు. ఆయన అప్పట్లో పేరుమోసిన భూస్వాములైన టీఎన్ కుటుంబీకులకు అనుచరుడుగా వుండేవారు.
- 1984 డిసెంబరు 24న ములకలచెరువు మండలం చౌడసముద్రంలో భూస్వామి పుట్టా వెంకట్రమణను రైతు కూలీ సంఘం కార్యకర్తలు బస్సులోనే తుపాకులతో కాల్చి చంపారు. ఆయన రైతు కూలీ సంఘానికి వ్యతిరేకంగా భూస్వాములను ఏకం చేసి రైతు సంఘం పేరిట కార్యకలాపాలు సాగించిన వ్యక్తి.
- అదే రోజు అర్ధరాత్రి చౌడసముద్రం సమీపంలో ప్రతీకార దాడిలో మాజీ ఎమ్మెల్సీ ఏవీ ఉమాశంకర్‌రెడ్డి హత్యకు గురయ్యారు. ఆయన మాజీ ఎమ్మెల్యే ఏవీ లక్ష్మీదేవమ్మ భర్త.
- మదనపల్లె మల్లికార్జున థియేటర్ సమీపంలో తంబళ్ళపల్లి మండలం అన్నగారిపల్లికి చెందిన భూస్వామి నరసింహారెడ్డిని ఉద్యమకారులు బాంబులేసి కత్తులతో పొడిచి చంపారు.
- ములకలచెరువు మండలం చౌడసముద్రం పంచాయతీ రెడ్డెంవారిపల్లి సిద్ధారెడ్డి కూడా ఇంటివద్దే ఉద్యమకారుల చేతుల్లో హత్యకు గురయ్యారు.
- ములకలచెరువు మండలం గుత్తావారిపల్లిలో భూస్వామి శివయ్య, అతని మరో ఇద్దరు సన్నిహితులు మొత్తం ముగ్గురు హత్యకు గురయ్యారు.
- దీనికి ప్రతీకారంగా రైతు కూలీ సంఘం నేత నాగిరెడ్డి బస్సు ఎక్కుతుండగా ప్రత్యర్థులు కత్తులతో నరికి చంపారు.
- తంబళ్ళపల్లి మండలం బురుజులో రైతుకూలీ సంఘం నాయకుడు రామిరెడ్డిని ప్రత్యర్థులు గొంతు కోసి చంపారు.
- తంబళ్ళపల్లి పోలీసు స్టేషన్ పక్కనే నివాసమున్న రైతు సంఘం నేత నూకల సుబ్బన్నను ఉద్యమకారులు ఆయన ఇంట్లోనే హత్య చేశారు.

మరణించిన నక్సల్స్

- తంబళ్ళపల్లి మండలం డేగావారిపల్లికి చెందిన పీపుల్స్ వార్ నేత వేమనారాయణరెడ్డి అనంతపురం జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు.
- అదే మండలం దబ్బలగుట్టపల్లికి చెందిన నక్సలైట్ వెంకట్రమణారెడ్డి వరంగల్ జిల్లా ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు.
- పెద్దమండ్యం మండలం కలిచెర్లకు చెందిన ఉమ్మడి జిల్లా పీపుల్స్ వార్ కార్యదర్శి మంగలి కృష్ణప్ప అలియాస్ రెడ్డెప్ప, ఆయన భార్య లక్ష్మి, ఆయన తమ్ముడు వెంకటస్వామి ముగ్గురూ కలకడ మండల సరిహద్దుల్లోని గుట్టపల్లి వద్ద 1995లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు.
- ఐరాల మండలానికి చెందిన నక్సల్ నేత మహదేవరెడ్డి కూడా జిల్లాలోనే ఎన్‌కౌంటర్ అయ్యారు.
- శ్రీకాళహస్తి ప్రాంతానికి చెందిన భూపతి అలియాస్ వహార్కండే యులు నేతృత్వంలో చురుగ్గా పనిచేసిన కాళంగి దళం మొత్తం ఎన్‌కౌంటర్‌లో తుడిచిపెట్టుకుపోయింది. కాళంగి ప్రాజెక్టు సమీపంలోని అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మృతి చెందారు.
- కంభంవారిపల్లి, ఎర్రావారిపాలెం మండలాల సరిహద్దుల్లోని శేషాచల అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కూడా ఐదుగురు నక్సలైట్లు చనిపోయారు.
- పీలేరు శివార్లలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అనంతపురం జిల్లా నక్సలైట్ నాయకుడు ఎర్ర శీను మృతి చెందారు.
- పెద్దమండ్యం మండలం కనమలోల్లపల్లి వద్ద చాకిబండ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మహిళా నక్సలైట్ సహా నలుగురు చనిపోయారు.
- తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ విద్యార్థి చలపతి ఆర్మీకి ఎంపికై శిక్షణ మధ్యలో తిరిగి వచ్చేసి పీపుల్స్ వార్‌లో చేరారు. క్రమంగా యాక్షన్ కమిటీ సభ్యుడిగా ఎదిగారు. అరెస్టు అయి జైల్లోనే అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు.

అలిపిరి దాడితో అంతం

సీఎం చంద్రబాబుపై 2003 అక్టోబరులో అలిపిరి వద్ద నక్సలైట్లు క్లైమోర్ మైన్ పేల్చి హత్యాయత్నానికి పాల్పడడం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ఆ దాడి నుంచీ చంద్రబాబు తృటిలో తప్పించుకున్నారు. ఆ ఘటనతో రాష్ట్ర వ్యాప్తంగా నక్సల్ కార్యకలాపాలపై నిర్బంధం తీవ్రతరమైంది. 2004లో ఏర్పడిన వైఎస్ ప్రభుత్వం సైతం అదే పంథా కొనసాగించడంతో క్రమంగా జిల్లాలో నక్సల్ కార్యకలాపాలు తగ్గుముఖం పడుతూ వచ్చి గత రెండు దశాబ్దాలుగా దాదాపు ఆగిపోయాయి.

25న సుభాష్ పాలేకర్ రాక



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త సుభాష్ పాలేకర్ శనివారం తిరుపతికి రానున్నారు. ఆయన పర్యటన వివరాలను ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు మంగళవారం మీడియాకు వెల్లడించారు. ఈనెల 25న ఎస్వీయూలోని శ్రీనివాసా ఆడిటోరియంలో వెయ్యి మంది విద్యార్థులకు.. 28న వెయ్యి మంది రైతులకు ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. ఈ సభకు అతిథులుగా మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు పాల్గొంటారన్నారు. వర్డ్ ప్రతినిధి డాక్టర్ గంగాధర్, బోటనీ అధ్యాపకుడు వేణు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ, కల్చరల్ కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ చౌదరి తదితరులు పాల్గొన్నారు. కాగా, 27న పద్మావతి మహిళా యూనివర్సిటీ ఆడిటోరియంలోనూ అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు.

'మహా' మోసం

● కుంభమేళాలో సౌకర్యాలు కల్పిస్తామంటూ రూ.3.65 లక్షలు కాజేసిన నిందితులు

● బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 21(ఆంధ్రజ్యోతి): మహాకుంభమేళాలో సౌకర్యాలు కల్పిస్తామంటూ రూ.3.65 లక్షలు కాజేశారు. బాధితుడు, న్యాయవాది సుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్వీ యూనివర్శిటీ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రామయ్య తెలిపిన ప్రకారం.. తిరుపతి నగరం గాయత్రినగర్‌కు చెందిన న్యాయవాది సుబ్రహ్మణ్యం నేతృత్వంలో 27 మంది కుంభమేళాకు వెళ్లాలనుకున్నారు. అక్కడ కాటేజీలు, భోజన సౌకర్యం తదితరాలు కల్పించే వారికోసం వెబ్‌సైట్‌లో చూశారు. ఇక్కడ అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామంటూ ఉత్తరాదికి చెందిన కొందరు వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. వీరిని నమ్మిన తిరుపతివాసులు మూడు అకౌంట్ల ద్వారా వారి బ్యాంకు ఖాతాలకు రూ.3.65 లక్షలు పంపారు. ఆ తర్వాత 27 మంది కుంభమేళాకు వెళ్లడానికి సిద్ధమయ్యారు. అయితే, డబ్బులు పంపాక వారిని సంప్రదించడానికి ప్రయత్నిస్తే వారి సెల్‌ఫోన్లు స్విచ్ ఆఫ్ లేదా తాత్కాలికంగా పనిచేయడంలేదని వచ్చింది. రెండు రోజులు పాటు వీరు ఫోన్లలో ప్రయత్నిస్తూనే ఉన్నారు. చివరకు మంగళవారం ఎస్వీయూ స్టేషన్‌లో బాధితుల తరపున న్యాయవాది సుబ్రహ్మణ్యం ఫిర్యాదు చేశారు. సీఐ రామయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలిపిరిలో కట్టుదిట్టంగా తనిఖీలు

తిరుమల, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తిరుమల నుంచి ఎర్రచందనాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో విజిలెన్స్, ఫారెస్ట్ సిబ్బంది అలిపిరి వద్ద నిఘా పెట్టారు. మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తిరుమల నుంచి తిరుపతికి చేరుకున్న తర్వాత కూడా వాహనాలు ఆపి తనిఖీలు చేయడంతో పలువురు భక్తులు ఏం జరిగిందో తెలియక కంగారుపడ్డారు.

